www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# ప్రజా విశ్వంభర

అక్షరం సాక్షిగా...

సోమవారం 18 - 8 - 2025 | సంపుటి : 1 | సంచిక : 42 | పేజీలు : 12 | వెల : 5/- | తెలంగాణ/ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ CMD



## జల సంబురం..
# కృష్ణమ్మ పరవళ్లు

- నాగార్జునసాగర్‌కు కొనసాగుతున్న వరద..
- 22 గేట్లు ఎత్తి నీటి విడుదల
- ప్రస్తుతం 587 అడుగులకు చేరిన నీటి మట్టం

విశ్వంభర, నాగార్జునసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో నాగార్జున సాగర్‌కు వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టు 22 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ స్పిల్‌వే ద్వారా 1.71 లక్షల క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. ఇన్‌ఫ్లో 1.98 లక్షల క్యూసెక్కులు కాగా, ఔట్ ఫ్లో 2.13 లక్షల క్యూసెక్కులుగా ఉంది. నాగార్జునసాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 587 అడుగుల నీటి మట్టం ఉంది. సాగర్ పూర్తి స్థాయి సామర్థ్యం 312 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 305 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

## ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా
# సీపీ రాధాకృష్ణన్

- ప్రకటించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా
- లోక్‌సభ సభ్యునిగా, గవర్నర్‌గా పనిచేసిన రాధాకృష్ణన్



**విశ్వంభర, నేషనల్ బ్యూరో: ఎన్డీయే తరపున ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎవరనే ఉత్కంఠకు తెరపడింది. ఆదివారం ఢిల్లీలో సమావేశమైన బీజేపీ పార్లమెంటరీ పార్టీ బోర్డు దీనిపై కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ పేరును ఖరారు చేసినట్టు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రకటించారు.** 1957 మే 4న జన్మించిన సీపీ రాధాకృష్ణన్.. తమిళనాడులోని కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి రెండు సార్లు బీజేపీ తరుఫున ఎంపీగా ఎన్నికయ్యారు. తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగానూ పనిచేశారు. 2016 నుంచి 2019 వరకు ఆల్ ఇండియా కాయర్ బోర్డ్ ఛైర్మన్‌గా సేవలందించారు. తమిళనాడు బీజేపీ సీనియర్ నాయకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. 2023 ఫిబ్రవరి 18 నుంచి ఝార?ండ్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. గతంలో తెలంగాణతో పాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ ఆయన అదనపు బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్నారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థిని ఎంపిక చేసే అధికారాన్ని ఎన్డీయే పక్షాలు ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాకు అప్పగించిన సంగతి తెలిసిందే. నామినేషన్ దాఖలుకు ఈ నెల 21 చివరి తేదీ.





# పార్టీలపై ఈసీ ఎలాంటి వివక్ష చూపదు

- అన్ని పార్టీలను సమానంగా చూస్తాం
- సంస్కరణల్లో భాగంగానే ఓటరు జాబితా సవరణ
- రాజ్యాంగ సంస్థలను అవమానించడం సరికాదు
- ప్రతిఒక్క ఒటరుకు ఈసీ దన్నుగా నిలుస్తుంది
- సవరణ ప్రక్రియ హడావుడిగా చేస్తున్నామన్నది అవాస్తవం
- డబుల్ ఓటింగ్, ఓటు చోరీ ఆరోపణలకు ఈసీ భయపడే ప్రసక్తే లేదు
- కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** ఎన్నికల సంఘానికి ఎలాంటి భేదభావాలు ఉండవని, అన్ని పార్టీలను సమానంగా చూస్తామని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు. ఓటు చోరీ పేరుతో కొందరు అనవసర అనుమానాలు లేవనెత్తుతున్నారని ఆక్షేపించారు. బిహార్‌లో ఓటరు జాబితా సమగ్ర సవరణపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్ననేపథ్యంలో మీడియా సమావేశం నిర్వహించిన సీఈసీ.. రాజ్యాంగ సంస్థలను అవమానించడం సరికాదన్నారు. ఓటరు జాబితాను బూత్ లెవల్‌లోనే ప్రతి పార్టీ చూసుకుంటుందన్నారు. సంస్కరణల్లో భాగంగానే ఓటరు జాబితాను సవరిస్తున్నట్లు స్పష్టం చేశారు. "బిహార్‌లో ఎస్ఐఆర్‌పై కొన్ని పార్టీలు, సంబంధిత నేతలు అసత్యప్రచారం చేయడం తీవ్ర ఆందోళనకరం. ఎన్నికల సంఘం భుజాలపైనుంచి కొన్ని రాజకీయ పార్టీలు దాడులు చేస్తున్నాయి. బూత్ స్థాయి అధికారులు, ఏజెంట్లు పారదర్శకంగా ఈ ప్రక్రియలో నిమగ్నమయ్యారు" అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు.

### ఇప్పటికి 10కిపైగా ఎస్ఐఆర్‌లు..

"సవరణ ప్రక్రియ హడావుడిగా చేస్తున్నామన్నది అవాస్తవం. ప్రతి ఎన్నికల ముందు ఓటరు జాబితాను సరిచేయడం ఎన్నికల సంఘం విధి. ఓటరు జాబితాలను సవరించేందుకు దేశంలో ఇప్పటివరకు 10 సార్లకుపైగా సవరణలను చేపట్టాం. పశ్చిమ బెంగాల్‌తోపాటు ఇతర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌ను నిర్ణీత సమయంలో ప్రకటిస్తాం. ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 1లోగా తెలియజేయాలని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలను అభ్యర్థిస్తున్నా" అని ఎన్నికల ప్రధాన కమిషనర్ వెల్లడించారు.

### ఈసీ వ్యాఖ్యలు హాస్యాస్పదం: కాంగ్రెస్..

తమకు అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీలనే తేడా ఉండదని ఎన్నికల సంఘం చెప్పడాన్ని కాంగ్రెస్ హాస్యాస్పదంగా పేర్కొంది. రాహుల్ గాంధీ లేవనెత్తిన ఏ ప్రశ్నకూ సీఈసీ అర్థవంతంగా సమాధానం ఇవ్వలేకపోయారని విమర్శించింది.

## 'ఈసీ'పై చర్యలకు వీల్లేకుండా చట్టం తెచ్చారు

- ప్రధాని మోడీ- అమిత్ షాలకు ఈసీ సాయం చేస్తున్నందునే ఇలా చేసింది
- బిహార్‌లో ఓట్ల చోరీకి 'ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ' ఓ మార్గం
- రాజ్యాంగాన్ని, 'ఒక వ్యక్తి- ఒక ఓటు' సూత్రాన్ని కాపాడుకునేందుకు పోరాటం చేస్తున్నాం
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

2లో...



2లో...

## ఓయూకు సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించిన వీసీ

- ఈనెల 21న రెండు కొత్త హాస్టల్స్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం
- "తెలంగాణ విద్యా రంగంలో రావాల్సిన మార్పులు ప్రభుత్వ ప్రణాళిక"అనే అంశంపై ప్రసంగించనున్న సీఎం

## నేషనల్ మెడికల్ రిజిస్టర్‌లో
# నమోదు తప్పనిసరి కాదు

- లోక్‌సభలో ఎస్పీ ఎంపీ ఆదిత్య యాదవ్ ప్రశ్నకి సమాదానమిచ్చిన
- మంత్రి అనుప్రియ పటేల్
- ఎన్.ఎం.ఆర్ నమోదుకు డాక్టర్ల అనాసక్తి..



2లో...

## ఊహాజనిత ఫ్యూచర్ సిటీకి భవిష్యత్తు లేదు



- విజన్ లేని సీఎం వల్ల ప్రజాధనం వృధా
- ఫార్మా సిటీ కోసం భూములిచ్చిన రైతులు మోసపోయారు
- ఫార్మాసిటీ భూములలో రియల్
- వ్యాపారం చేయాలన్న రేవంత్ రెడ్డి ఆకాంక్ష నెరవేరదు
- బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాడుతుంది
- భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2లో...



## 18 నుంచి లైసెన్స్ సర్వేయర్లకు రెండవ విడత శిక్షణ...

2లో...

- 23 జిల్లా కేంద్రాల్లో ప్రారంభించనున్నాం శిక్షణ పూర్తయిన వెంటనే వీరికి లైసెన్స్ జారీ చేయనున్నాం
- వీరి సేవలను గాంధీ జయంతి నాటికి అందుబాటులోకి తీసుకువస్తాం
- సర్వే విభాగం బలోపేతంతోనే రెవెన్యూ వ్యవస్థలో మెరుగైన సేవలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## గ్రూపు తగాదాలు, అంతర్గత విభేదాలను సహించబోను

- పార్టీకి నష్టం చేసే చర్యలను ఉపేక్షించేది లేదు
- అనంతపురం ఎమ్మెల్యేపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం
- ఆముదాలవలస, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యేల తీరుపైనా చంద్రబాబు అసంతృప్తి





2లో...

# రాహుల్ గాంధీ ప్రధాని అవుతారు

- మా పార్టీలో ఎలాంటి విభేధాలు లేవు
- భవిష్యత్‌లో ఏపీలో కూడా కాంగ్రెస్ బలపడుతుంది
- తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకున్నదే నీటి హక్కుల కోసం
- కేటాయింపులు జరిగాకే.. మిగులు జలాల అంశంపై చర్చ
- సముద్రంలోకి వెళ్లే జలాలు అని మాట్లాడటం సరికాదు
- గోదావరిపై మేం చేపట్టిన ప్రాజెక్టులు ఇంకా పూర్తి కాలేదు
- ఇరు రాష్ట్రాల వాటా తేలిన తర్వాతే ప్రాజెక్టులు కట్టుకుంటే న్యాయం
- రాజకీయ ప్రయోజనాల కంటే మాకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం
- మా ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయిన తర్వాత మిగులు జలాలుంటే వాడుకోవచ్చు
- విశాఖలో నిర్వహించిన 'స్టాప్ ఓట్ చోరీ' కార్యక్రమంలో భట్టి విక్రమార్క



2లో...

## యూరియా కొరత అంశాన్ని పార్లమెంటులో నిలదీయండి

- కొరత సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి
- కేటాయింపుల ప్రకారం సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలి
- కాంగ్రెస్ ఎంపీలకు మంత్రి తుమ్మల సూచన

## అలసత్వం వద్దు.. అంతా అప్రమత్తంగా ఉండాలి

- వర్షాలు, వరదల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లు
- ఇప్పటి వరకు 86.55 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయి
- తాత్కాలిక పునరుద్ధరణకు రూ.ఆరున్నర కోట్లు
- శాశ్వత పునరుద్ధరణకు రూ.143 కోట్ల వరకు వ్యయం
- మంత్రి డాక్టర్ దానసరి అనసూయ సీతక్క

2లో...

# రాహుల్ గాంధీ ప్రధాని అవుతారు

## మా పార్టీలో ఎలాంటి విభేధాలు లేవు

## విశాఖలో నిర్వహించిన 'స్టాప్ ఓట్ చోరీ' కార్యక్రమంలో భట్టి విక్రమార్క

మొదటిపేజీ తరువాయి...

విశ్వంభర, విశాఖ: భవిష్యత్‌లో ఏపీలో కూడా కాంగ్రెస్ బలపడుతుందని, రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విశాఖలో నిర్వహించిన 'స్టాప్ ఓట్ చోరీ' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా తమ పార్టీలో నాయకులకు స్వేచ్ఛ ఎక్కువ.. అంతేకానీ ఎలాంటి విభేదాలు లేవు అనిస్పష్టత ఇచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ పటిష్టంగా ఉంది.. అసంతృప్తి అనేది కొందరు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు తెలుగు రాష్ట్రాల మధ్య నీటి వివాదంపై స్పందించారు. ఏపీతో ఉన్న జలవివాదంపై చట్టబద్ధంగానే ముందుకు వెళతామని అన్నారు.

తెలంగాణకు వాటా ఇచ్చిన తర్వాత జలాలను ఏపీ వాడుకోవాలని చెప్పారు. తెలంగాణ తెచ్చుకున్నదే నదీ జలాల కోసం.. బీడు భూములను సాగులోకి తెచ్చుకోవడం కోసమని, రాష్ట్రంలో ప్రాజెక్టులు పూర్తయ్యి కేటాయింపులు జరిగాకే మిగులు జలాల అంశంపై చర్చలుంటాయని భట్టి స్పష్టం చేశారు. 'సముద్రంలోకి వెళ్ళే జలాల అని మాట్లాడటం అర్థం చేసుకోలేని అమాయకులు ఎవరూ లేరు.




గోదావరిపై మేం చేపట్టిన ప్రాజెక్టులు ఇంకా పూర్తి కాలేదు. వరద జలాలపై ఇరు రాష్ట్రాల వాటా తేలిన తర్వాతే ప్రాజెక్టులు కట్టుకుంటే న్యాయబద్ధంగా ఉంటుంది. నీటి వాటాలను తేల్చాల్సిన బాధ్యత కేంద్రానిది..రాజకీయ ప్రయోజనాల కంటే మాకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం. మాప్రాజెక్టులనిర్మాణం పూర్తయిన తర్వాత మిగులు జలాలుం టే వాడుకోవచ్చు.మా అవసరాలు తీరకుండా దిగువన ప్రాజెక్టులనిర్మిస్తే కేటాయింపుల్లో సమస్య వస్తుంది"అని భట్టి అన్నారు.

# యూరియా కొరత అంశాన్ని పార్లమెంటులో నిలదీయండి

మొదటిపేజీ తరువాయి...

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: తెలంగాణలో యూరియా కొరత అంశాన్ని పార్లమెంటులో కేంద్రాన్ని నిలదీయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ ఎంపీలను కోరారు. రాష్ట్రంలో యూరియా కొరత సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రాష్ట్ర ఎంపీలను కోరారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ లో రైతులు తీవ్ర యూరియా కొరతను ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. ఈ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తి, కేటాయింపుల ప్రకారం పూర్తిస్థాయిలో యూరియా సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. 2024-25 సంవత్సరానికి తెలంగాణకు కేంద్రం 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించగా, జులై 31 నాటికి కేవలం 4.36 లక్షల టన్నులు మాత్రమే సరఫరా అయింది.

దీంతో ఏడాదికి ఇంకా 2.24 లక్షల టన్నుల కొరత ఏర్పడింది. ఆగస్టు నెలలో 3.50 లక్షల టన్నుల అవసరం ఉండగా, కేవలం 1.70 లక్షల టన్నులు మాత్రమే సరఫరా కావడంతో రైతులు, ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న, వరి పంటలు సాగు చేసే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే ఈ సమస్యను పరిష్కరించాలని మంత్రి తుమ్మల




కేంద్ర ఎరువుల, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు ఇదివరకే లేఖలు రాసి, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ నుంచి స్వదేశీ యూరియా సరఫరాను 30,800 టన్నుల నుంచి 60,000 టన్నులకు పెంచాలని, ఏప్రిల్-జూన్ మధ్య తలెత్తిన లోటును భర్తీ చేయడానికి అదనపు కోటా కేటాయించాలని కోరారు.

# 18 నుంచి లైసెన్స్డ్ సర్వేయర్లకు రెండవ విడత శిక్షణ



మొదటిపేజీ తరువాయి...

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: రాష్ట్రంలో లైసెన్స్డ్ సర్వేయర్ల సేవలను అక్టోబర్ 2వ గాంధీ జయంతి నాటికి అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి మొదటి విడత సర్వేయర్ల శిక్షణ పూర్తయిందని, రెండవ విడత శిక్షణ 23జిల్లా కేంద్రాల్లో ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు ఆయా జిల్లాల్లో 18వ తేదీ ఉదయం 10 గంటలలోపు సర్వే విభాగం అసిస్టెంట్ డైరెక్టర్‌కు రిపోర్ట్ చేయాలని ఆయన సూచించారు. లైసెన్స్డ్ సర్వేయర్ల నియామకంపై ఆదివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి చేసిన నేపథ్యంలో ఇందుకు అవసరమైన లైసెన్స్డ్ సర్వేయర్ల సేవలను గాంధీ జయంతి రోజునాటికి అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించి మే 26 నుంచి జూలై 26 వరకు 50 పనిదినాల్లో ఆయా జిల్లా కేంద్రాల్లో ఏడు వేల మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని, గత నెల28, 29 తేదీల్లో జేఎన్టీయూ ఆధ్వర్యంలో ల్యాబ్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించి ఫలితాలు ప్రకటించామని అన్నారు. ఈపరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు 40రోజుల పాటు అప్రెంటిస్ శిక్షణను కూడా ప్రారంభించడం జరిగిందని తెలిపారు. శిక్షణ పూర్తయిన వెంటనే వీరికి లైసెన్స్ జారీ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. వీరి సేవలను పారదర్శకంగా నిర్వహించడానికి వీలుగా సర్వే మాన్యువల్‌ను రూపొందించాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ, సర్వే విభాగానికి మధ్య అవినాభావ సంబంధం ఉందని, సర్వే విభాగం బలోపేతంతోనే రెవెన్యూ వ్యవస్థలో మెరుగైన సేవలు అందించగలుగుతామని, దీనిని దృష్టిలో పెట్టుకొని సర్వేవిభాగాన్ని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. గత పదేళ్ళలో సర్వే విభాగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని రెవెన్యూశాఖ మంత్రి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు.

# ఊహాజనిత ఫ్యూచర్ సిటీకి భవిష్యత్తు లేదు




మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర,తెలంగాణ బ్యూరో:** సీఎంరేవంత్ రెడ్డిపదేపదేచెప్పిన ఊహాజనిత ఫ్యూచర్ సిటీకి భవిష్యత్తు లేదని, కేవలం తన కుటుంబ సభ్యుల ప్రయోజనాల కోసం హైదరాబాద్ ఫార్మాసిటీ భూములలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలన్న రేవంత్ రెడ్డి ఆకాంక్ష నెరవేరదని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఫార్మాసిటీ భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల పై కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్ లేని నాయకుడని, ఆయన తీసుకుంటున్న నిర్ణయాల వల్ల ప్రజాధనం వృధా అవుతుందని ఆయన ఆరోపించారు. ఫార్మా సిటీ కోసం భూమిలిచ్చిన రైతులు మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫార్మా సిటీ ప్రాజెక్టును రద్దు చేసి, దాని స్థానంలో ఫ్యూచర్ సిటీ అనే అవాస్తవ, ఊహాజనిత ప్రాజెక్టును ప్రవేశపెట్టారని దుయ్యబట్టారు. ఇది నిర్లక్ష్యనాయకుడు రాష్ట్రాన్ని పాలిస్తే ఏమవుతుందో దానికి ఫ్యూచర్ సిటీ ప్రచారం ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం,ఒక నిర్దిష్ట ప్రజా ప్రయోజనం కోసం సేకరించిన భూమిని ఇతరుల ప్రయోజనం కోసం రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు మళ్లించడం సాధ్యం కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ చట్టాన్ని ఉటంకిస్తూ, తాను రెండేళ్ల క్రితమే అసెంబ్లీలో ఈ విషయం పై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించానని గుర్తుచేశారు. అయినా, రేవంత్ ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు పీఆర్ కోసం ఖర్చు చేసి, ఇప్పుడు తీవ్రమైన న్యాయపరమైన అడ్డంకులను ఎదుర్కొంటోందని, చివరికి అధికారులు కూడా దీనిని అంగీకరిస్తున్నారని అన్నారు.

**ఫార్మా సిటీ కోసం 20 వేల ఎకరాలు భూములు..**

బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 56 గ్రామాల పరిధిలో హైదరాబాద్ ఫార్మసిటీ కోసం 20 వేల ఎకరాలతో ప్రతిపాదనలను తయారు చేసింది, స్థానిక రైతులు రాష్ట్ర ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి వచ్చితమ భూములను హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. అయితే కొంతమంది తమ భూములు ఇవ్వడం పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తే కాంగ్రెస్ పార్టీ మాత్రం అధికారంలోకి రాగానే హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం సేకరించిన ప్రతి ఎకరాన్ని తిరిగి రైతన్నలకు ఇస్తామని హామీలు ఇచ్చి, ఇప్పుడు రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు స్నేహితుల కోసం అవే భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ వారిని నిండా మోసం చేసిందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతన్నలు ఫార్మా కంపెనీల కోసం కేటాయించిన భూముల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్మాసిటీ ప్రాజెక్టు కోసం గత ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజా ధనంతో మౌలిక వసతుల కల్పనను ప్రారంభించిన, రేవంత్ రెడ్డి ప్రభుత్వందానిని పక్కన పెట్టి, ఇప్పుడు ఫ్యూచర్ సిటీ పేరుతో భూము లను అక్రమంగా రియల్ ఎస్టేట్‌కు మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ చర్యలు ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని, దీని వల్ల ప్రజలు, ముఖ్యంగా రైతులు నష్టపోతారని కేటీఆర్ హెచ్చరించారు. ఈ మొత్తం వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజలకు, రైతులకు స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# గ్రూపు తగాదాలు, అంతర్గత విభేదాలను సహించబోను




మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర, అమరావతి:** అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌పై సీఎంచంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూపు తగాదాలు, అంతర్గత విభేదాలను సహించబోనని మండిపడ్డారు. పార్టీకి నష్టం చేసే చర్యలను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు కేంద్రంగా వచ్చిన వివాదాలు, ఘటనలపై సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆముదాలవలస, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యేల తీరుపైనా చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. చిన్న విమర్శలకు కూడా అవకాశం ఇచ్చేలా ఎమ్మెల్యేల వైఖరి ఉండకూడదని స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారంపై వెంటనే ప్రజలకు వాస్తవాలు చెప్పాలని ఆదేశించారు. ఎమ్మెల్యేలు, నేతలు చేసే పనులు పార్టీకి చెడ్డపేరు తెస్తాయని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేల తప్పులతో జరిగే నష్టాన్ని పార్టీ ఎందుకు ఎదుర్కోవాలని ప్రశ్నించారు.

మూడు విషయాలపై పార్టీ నాయకత్వం నుంచి చంద్రబాబు నివేదిక కోరినట్టు సమాచారం. ఉచిత బస్సుపై వైకాపా చేసే తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పార్టీ నేతలకు సూచించారు. ప్రజలతో మమేకం కావడం వల్లే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు.

## నేషనల్ మెడికల్ రిజిస్టర్‌లో

# నమోదు తప్పనిసరి కాదు

మొదటిపేజీ తరువాయి...

విశ్వంభర,తెలంగాణ బ్యూరో:అల్లోపతి డాక్టర్ల దేశవ్యాప్త వివరాల కోసం కేంద్ర ప్రభుత్వం గత ఏడాది మొదలుపెట్టి విపరీతంగా ప్రచారం చేసిన నేషనల్ మెడికల్ రిజిస్టర్ (ఎన్.ఎం.ఆర్) కేవలం ఒక్క సంవత్సరంలోనే ప్రతికూల ఫలితాలను చూపించింది. మొదట్లో డాక్టర్స్ తమను తాము నమోదు చేసుకోవడం ఇందులో తప్పనిసరి చేశారు. గత సంవత్సరం ఆగస్టు 23న కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా గొప్ప ప్రారంభించిన ఈపోర్టల్లో వైద్యుల నమోదు దరఖాస్తులలో కేవలం ఒక శాతం కంటే తక్కువ వివరాలు నమోదు అయ్యాయి. 13 లక్షలకు పైగా రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్లు ఉన్న మన దేశంలో ఈ ఆగస్టు 8 వరకు మొత్తం 11,200 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 996 మంది వైద్యుల దరఖాస్తులు మాత్రమే ఆమోదించబడ్డాయి. అయితే వివరాల నమోదు ప్రక్రియ చాలా క్లిష్టంగా ఉందనీ.. అనేక అడ్డంకులు రావడంతో ..కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఇకపై డాక్టర్లు స్వచ్ఛందంగా నమోదు చేసుకోవచ్చునిదీనిపై ఎలాంటి ఒత్తిడి లేదని పార్లమెంటులో లిఖితపూర్వక సమాధానం ద్వారా ప్రకటన చేశారు. ఓ జాతీయ పత్రిక లో వచ్చిన కథనం ఆధారంగా ప్రశ్న అడిగిన సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఆదిత్య యాదవ్ ప్రశ్నకి సమాధానంగా ఆగస్టు 8నలోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంలో మంత్రి ఇలా పేర్కొన్నారు. "నేషనల్ మెడికల్ రిజిస్టర్ గుర్తింపు జారీ కోసం దరఖాస్తు స్వచ్ఛందమని జాతీయ వైద్య కమిషన్ (ఎన్.ఎం.సీ) తెలియజేసిందని.. ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ సభకి తెలిపారు.

**దరఖాస్తు ప్రక్రియలో డాక్టర్ల అనాసక్తి..**

నిజానికి ఈ ప్రక్రియ అమలులోనే అసలు సమస్య ఉందని వైద్యులు అంటున్నారు. ఈ ప్రొసీజర్ ప్రకారం, దరఖాస్తుదారు నేషనల్ మెడికల్ రిజిస్టర్ పోర్టల్ ద్వారా చేసుకున్న దరఖాస్తు ముందుగా సంబంధిత రాష్ట్రవైద్య మండలికి వెళుతుంది, అక్కడ వారి నమోదు చేసుకున్న వివరాలు అందించిన ఆధారాలను ధృవీకరించిన తర్వాత రాష్ట్ర వైద్య మండలిఎన్.ఎం.సీకి దరఖాస్తును పంపుతుంది. ఈ దరఖాస్తును పరిశీలించి అంతా సరైనదని ధృవీకరణ జరిగిన తర్వాత ఆమోదించి నేషనల్ మెడికల్ రిజిస్టర్ ఐడీ జారీ చేయబడుతుంది. అయితే దీనిపై దేశ వ్యాప్తంగా వైద్యుల నుండి వచ్చిన స్పందన మాత్రం దాదాపుగాశూన్యం.

**ఇందుకేనా....**

ఈ దరఖాస్తు ప్రక్రియలో ఉన్న ఓ కీలక ప్రొసీజర్ వారిని ఈ నమోదునుండి దూరం అయేలా చేస్తోందని తెలుస్తోంది..ఈ పోర్టల్ లో వైద్యులు తమ పేర్లు లేదా ఇతర వివరాలు అందించిన తరువాత అవి ప్రస్తుత డేటాతో సరిపోలకపోతే వారి ఆధార్‌ను అప్‌లోడ్ చేసి అఫిడవిట్ సమర్పించాలని నిబంధనల్లో కోరారు. దీంతో అఫిడవిట్ దాఖలు చేయడం చాలా మంది వైద్యులకు ఇబ్బందికరంగా మారింది.నాలుగు లక్షలకు పైగా అల్లోపతి వైద్యులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐ.ఎం.ఏ) కూడా ఈ సమస్యను గతంలోనే ఎన్.ఎం.సీ దృష్టికి తీసుకెళ్లింది.దీంతో అప్పటి ఛైర్మన్ డా.గంగాధర్ అక్టోబర్ 23, 2024న తన పిటిషన్‌లో ఇలా పేర్కొన్నారు.. ఒకసారి రాష్ట్ర వైద్య మండలి రిజిస్ట్రేషన్ నంబర్, డిగ్రీ సర్టిఫికెట్‌లను ధృవీకరించిన తర్వాత, గతంలో ఉన్న భారత వైద్య మండలి (ఎం.సి.ఐ) చేసినట్లుగా, వాటిని ఎన్.ఎం.సీ నేరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.దీనిని ఆధార్‌తో లింక్ చేయడం ద్వారా ఈ ప్రక్రియ తేలిక కావడమే కాకుండా అఫిడవిట్‌ను అప్‌లోడ్ చేయాలనే నిబంధన తొలగించడం ద్వారా ఎక్కువ మంది డాక్టర్లు నమోదుకి ఆసక్తి చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**నమోదు తప్పనిసరి అంటున్న చట్టం..** నేషనల్ మెడికల్ రిజిస్టర్‌లో నమోదు అనేది ఎన్.ఎం.సీ చట్టం, 2019 లోని సెక్షన్ 31 ప్రకారం తప్పనిసరి అనీ.., దీని ప్రకారం ఎథిక్స్ అండ్ మెడికల్ రిజిస్ట్రేషన్ బోర్డు (ఈఎంఆర్బీ) లైసెన్స్ పొందిన వైద్య నిపుణుడి పేరు, చిరునామా , అతనికి చెందిన అన్ని అర్హతలను పేర్కొంటూ ఎలక్ట్రానిక్ రూపంలో జాతీయరిజిస్టర్‌ను నిర్వహించాలనీ ఉంది. దీంతో ఈ సమస్య పరిష్కారానికి కేంద్రం ప్రత్యేక చొరవ చూపాలనే వాదన వినిపిస్తోంది.

# ఓయూకు సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించిన వీసీ

మొదటిపేజీ తరువాయి...

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : ఉస్మానియా యూనివర్సిటీ లో ఈనెల 21న నిర్వహించే పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు రావాల్సిందిగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి కాశీం ఆదివారం ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ని ఆయన నివాసంలో కలిసి ఆహ్వానించారు. ఓయూలో రూ.80 కోట్లవ్యయంతో నిర్మాణమైన 1200 మంది విద్యార్థులకు వసతి కల్పించే రెండు హాస్టల్స్ ను ప్రారంభించాలని సీఎంను వారు ఆహ్వానించారు. గిరిజన సంక్షేమం శాఖ ఆర్థిక సహాయంతో మరో 300 మంది విద్యార్థులకు వసతి కల్పించే రెండు కొత్త హాస్టల్స్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం సీఎం చేతుల మీదుగా చేయించనున్నారు. ఇప్పటికే ఓయూలో ఉన్న 25 హాస్టళ్లలో 7223 మంది విద్యార్థులకు వసతి ఉండగా సీఎం చేతుల మీదుగా ప్రారంభించే హాస్టల్స్ అదనపు వసతిని సమకూర్చనున్నాయి. ఇదే కార్యక్రమంలో దాదాపు 10 కోట్ల నిధులతో డిజిటల్ లైబ్రరీ రీడింగ్ రూమ్ పనులకు కూడా సీఎం ప్రారంభించనున్నారు. అదే రోజు ఓయూలో ఉన్న టాగూర్ ఆడిటోరి యంలో వెయ్యి మంది ప్రొఫెసర్లను,విద్యార్థులను ఉద్దేశించి " తెలంగాణ విద్యా రంగంలో రావాల్సిన మార్పులు ప్రభుత్వ ప్రణాళిక" అనే విషయం మీద సీఎం



ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొంటారు.

ఇరవై ఏళ్ల కాలంలో ఓయూలోకి ముఖ్యమంత్రి హోదాలో వచ్చి ప్రసంగించనున్న తొలి సీఎం రేవంత్ రెడ్డి నేనని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో "సీఎం రీసెర్చ్ ఫెలో షిప్ " తో పాటు విదేశీ పర్యటనకు వెళ్లే విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించే పథకాన్ని సీఎం చేతుల మీదుగా ప్రారంభించనున్నామని వీసీ తెలిపారు.

# 'ఈసీ'పై చర్యలకు వీల్లేకుండా చట్టం తెచ్చారు

మొదటిపేజీ తరువాయి...

విశ్వంభర, నేషనల్ బ్యూరో: బిహార్‌లో ఓట్ల చోరీకి 'ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ' మార్గమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఎన్నికల సంఘం పై ఎటువంటి చర్యలకు అవకాశం లేకుండా 2023లో కేంద్రం ఓ చట్టం తీసుకొచ్చిందని, ప్రధాని మోడీ-అమిత్ షాలకు ఈసీ సాయం చేస్తున్నందునే ఇలా చేసిందని ఆరోపించారు. ఓటర్ల జాబితా అవకతవకల విషయంలో ప్రతిపక్షాల ఆరోపణలపై ఎన్నికల సంఘం మీడియా సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు."ఈ రోజు ఎన్నికల సంఘం ఓ సమావేశం నిర్వహించింది.అయితే.. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సీసీ ఫుటేజీల విషయంలో ప్రభుత్వం చట్టాన్ని ఎందుకు మార్చింది? అదేవిధంగా.. ఎన్నికల కమిషనర్లపై ఎటువంటి కేసు నమోదు చేసేందుకు వీల్లేకుండా 2023లో చట్టం చేసింది. ప్రధాని మోడీ, అమిత్ షాలకు ఈసీ సాయం చేయడంతోపాటు ఓట్ల చోరీలో పాలుపంచుకుంటున్నందుకు ఎవరూ చర్యలు తీసుకోకూడదనే దీన్ని రూపొందించింది" అని రాహుల్ గాంధీ ఆరోపించారు. బిహార్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర' తొలిరోజు ముగింపు సభలో ప్రసంగిస్తూ.. రాజ్యాంగాన్ని, 'ఒక వ్యక్తి- ఒక ఓటు' సూత్రాన్ని కాపాడుకునేందుకు పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితా



వ్యవహారంలో ప్రతిపక్షాల ఆరోపణలను అంతకుముందు ఎన్నికల సంఘం ఖండించిన విషయం తెలిసిందే.

ఈసీకి ఎలాంటి భేదభావాలు ఉండవని, అన్ని పార్టీలను సమానంగా చూస్తుందని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు. ఓటు చోరీ పేరుతో కొందరు అనవసర అనుమానాలు లేవనెత్తుతున్నారని ఆక్షేపించారు. రాజ్యాంగ సంస్థలను అవమానించడం సరికాదన్నారు. 'ఓట్ల చోరీ' ఆరోపణలపై రాహుల్ గాంధీ వారం రోజుల్లోపు అఫిడవిట్ సమర్పించాలని, లేనిపక్షంలో వాటిని నిరాధారమైనవిగా పరిగణిస్తామని స్పష్టం చేశారు.

# అలసత్వం వద్దు..
# అంతా అప్రమత్తంగా ఉండాలి

మొదటిపేజీ తరువాయి...

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: అలసత్వం వద్దు.. అంతా అప్రమత్తంగా ఉండాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దానసరి అనసూయ సీతక్క అధికారులకు సూచించారు. ఆదివారం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు, వరదల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పడిన పరిస్థితులపై సమీక్షించారు.

ఇప్పటి వరకు మొత్తం 86.55 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయని మంత్రికి నివేదించారుఈ రహదారుల తాత్కాలిక పునరుద్ధరణకు ఆరున్నర కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ.143 కోట్ల వరకు వ్యయం అవుతుందని ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. మొత్తంగా రహదారులు, ఇతర మౌలిక వసతుల పునరుద్ధరణకు రూ.150 కోట్ల వరకు అవసరమవుతుందని అధికారుల నివేదిక వెల్లడించింది. అలాగే వర్షాలు, వరదల కారణంగా 66 రహదారులు, 83 క్రాస్ డ్రైన్ పనులు, 60 చోట్ల గండ్లు పడినట్లు వివరించారు.

అంతేకాకుండా శిథిలావస్థలో ఉన్న 36 భవనాలు గుర్తించామని, వాటిలో నివసిస్తున్న ప్రజలను ఇతర సురక్షిత ప్రదేశాలకు తరలిస్తున్నామని మంత్రికి తెలియజేశారు. గత రెండు రోజులుగా కురిసిన వర్షాల కారణంగా రవాణా సంబంధాలు తెగిపోయిన కొన్ని గ్రామాలకు మళ్లీ కనెక్టివిటీ పునరుద్ధరించినట్లు %వఅష% అశోక్ తెలిపారు. మంచిర్యాల జిల్లా భీమిలి మండలంలోని కర్జిభీంపూర్ గ్రామానికి, అదే మండలంలోని రాజారం గ్రామానికి రవాణా సంబంధాలను పునరుద్ధరించినట్లు వెల్లడించారు. అసిఫాబాద్ జిల్లా, అసిఫాబాద్ మండలంలోని రాజూర్ గ్రామానికి కూడా కనెక్టివిటీ పునరుద్ధరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, అధికారులు,



సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ఉన్నవారు పనిప్రదేశాలను వదిలి వెళ్లరాదని సూచించారు. వర్షాలు తగ్గిన వెంటనే తాత్కాలిక మరమ్మతు పనులను తక్షణం పూర్తి చేయాలని ఆదేశిస్తూ, జిల్లా కలెక్టర్ల వద్ద ఇప్పటికే తగిన నిధులు అందుబాటులో ఉన్నాయని, వాటిని వినియోగించి తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సమాజానికి నేరుగా సంబంధించిన రహదారులు, కల్వర్టులు, భవనాల పునరుద్ధరణలో ఎలాంటి ఆలస్యం చేయకుండా వేగంగా స్పందించాలని మంత్రి సీతక్క ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఊరూరా వాడవాడలా బహుజన బతకమ్మని ఉద్యమంగా జరుపుకుందాం

విశ్వంభర, హైదరాబాద్: బహుజన బతుకమ్మ నిర్వహణ కమిటీ ఆధ్వర్యం లో హైదరాబాదులోని బాగ్ లింగంపల్లి లోని (కమ్యూనిటీ హాల్) యందు బహుజన బతుకమ్మ సమాలోచనల సమావేశం నిర్వహిం చడం జరిగిందిఈ సమావేశానికి అరుణోదయ విమలక్క, ప్రొఫెసర్ లక్ష్మీ, కట్టా భగవంత రెడ్డిలు అధ్యక్ష వర్గంగా వ్యవహరించడం జరిగింది. ఈ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ.... పకృతి విధ్వంసం అంటే ప్రజలపై యుద్ధమేనంటూ – శాంతి స్వావలంబణను చాటుతూ బహుజన బతుకమ్మను ఘనంగా నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా పలువురు వక్తులు పిలుపునిచ్చారు. బహుజన బతుకమ్మ నిర్వహణ కమిటీ తీసుకున్న ఈ అంశాన్ని హాజరైన మిత్రులందరు ఈ సందర్భంగా అభినందించారు. తమ తమ గ్రామాల్లో బహుజన బతుకమ్మను నిర్వహిం చాలని నిర్వహణ కమిటీ వాళ్లను కోరడం జరిగింది. బతుకమ్మ ఉత్సవం కాదు ఉద్యమంగా కొనసాగించాలన్నారు. అభివృద్ధి పేరుతో అడవులను ధ్వంసం చేయడం,ఆదివాసుల హక్కులను కాలరాయడం సరైంది కాదన్నారు. ఊరూరా వాడ వాడనా బహుజన బతుకమ్మ బ్యానర్లు వెలిసేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో వివిధ ప్రజాసంఘాల నాయకులులిలి రచయిత :ఎనిశెట్టి శంకర్ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు:ఏపూరి మల్సూర్, పోతుల రమేష్, రాకేష్, సురేష్, రైతు–కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి వెల్తురు సదానందం, ఎఐఎఫ్టీయూ రాష్ట్ర అధ్యక్షులు వై.మల్లేశం, పిడిడియు (విజృంభణ) దిలీప్, పీవోడబ్ల్యూ (స్త్రీ విముక్తి ) నాయకురాలు : లావణ్య, మరియు, జగన్ రెడ్డి, సంతోష్, సాయిరాం, మన్నారపు నాగరాజు, పాలడుగు శ్రీను, మోహన్, జనార్ధన్, రాజు, బుల్లెట్ వెంకన్న, పాల్, రాజేశ్వరి, కల్వకుర్తి రాములు, పోచమల్లు, లలిత, భద్ర, యుగంధర్, నూతన్, పద్మ, శ్రీను, పురుషోత్తం, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



# బీసీల కోసం రెడ్లు, వెలమలు ప్రాణాలిచ్చినా అభ్యంతరం లేదు: తీన్మార్ మల్లన్న

విశ్వంభర, హైదరాబాద్:బీసీలకు తెలంగాణలో ఉన్న రెడ్లు, వెలమలకు ఎప్పుడోబంధం తెగిపోయిందని ఇక మీతో సోపతే వద్దు అని ఎమ్మెల్సీ తీన్మార్మల్లన్నమరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. జయశంకర్ సార్ కలలు గన్న బీసీ రాజ్యం కోసం బీసీ జేఏసీ నడుము కట్టి ముందుకు వస్తున్నదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని అన్ని స్థానాల్లో బీసీ జేఏసీ తరఫున అభ్యర్థులు బరిలో ఉంటారని చెప్పారు. ఇవాళ నిజామాబాద్ లో నిర్వహించి బీసీ జేఏసీ సమావేశానికి హాజరైన మల్లన్న ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చరిత్రలో మొట్టమొదటి సారి బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని రెడ్లు, వెలమలు ఢిల్లీకి వెళ్లి ధర్నా చేశారని నిజానికి ఆ ధర్నా వాళ్లు చేయలేదని బీసీల చైతన్యమై వాళ్లతో ఆ ధర్నా చేయించిందన్నారు. ఇది బీసీల సత్తా అని అన్నారు. గతంలో కేసీఆర్ అధికారంలోకి వచ్చేందుకు ఆ తర్వాత రెడ్లు అధికారంలోకి వచ్చేందుకు మా బడుగు బలహీన వర్గాల ప్రజల ప్రాణాలే పోయాయని ఇప్పుడు బీసీలు అధికారంలోకి రావడం కోసం రెడ్లు, వెలమలు ఆత్మబలిదానం చేసుకున్నా అంగీకరిస్తామని సంచలన వ్యాఖ్యలు చేశారు.

**అడ్డుకుంటే బీజేపీకి ఉరితాడు..**

బీసీల రిజర్వేషన్ల విషయంలో బీజేపీ తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని ఇది భవిష్యత్తో బీజేపీకి ఉరితాడుగా మారుతుందని హెచ్చరించారు. కేసీఆర్



నోటి నుంచి ఇప్పటి వరకు బీసీ అనే పదం రాలేదని బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ లోని అగ్రవర్ణాలంతా ఒకతాను ముక్కలేనని విమర్శించారు. విష సర్పాలు ఒక పుట్ట నుంచి మరో పుట్టలోకి మారినంత మాత్రాన దాని విషయం పోదని అలాగే అగ్రవర్ణాల నాయకులు పార్టీ మారినంత బీసీలకు న్యాయం జరగదన్నారు. నిజామాబాద్ జిల్లా అగ్రవర్ణాల చెర నుంచి విముక్తి కావాలన్నారు. మా ఓట్లు మీకు వద్దు, మీ ఓట్లు మాకు వద్దన్నారు. గ్రామాల్లో 2028లో బీసీలే రాజ్యాధికారంలోకి వస్తారన్నారు. త్వరలోనే బీసీ రాజకీయ పార్టీ రాబోతున్నదని ఆ పార్టీతోనే అగ్రవర్ణ పార్టీలతో పోటీ పడబోతున్నామని చెప్పారు. కవితకు మాకు ఏం సంబంధం ఆమె వెలమ వ్యక్తి, కవిత బీసీ ఉద్యమాలు తన తండ్రి అధికారంలో ఉండగా చేయాల్సిందన్నారు.

# కవిత్వం కదిలించేదిగా ఉండాలి: నిఖిలేశ్వర్



విశ్వంభర, హైదరాబాద్: కవిత చైతన్యం ఇతరులను కదిలించేది ఉండాలని ప్రముఖ కవి, విమర్శకులు నిఖిలేశ్వర్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో ప్రముఖ జర్నలిస్టు, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి రచించిన ఆశయ (పదం నవల) అభద్రం (కథలు), సజీవం (కవిత్వం), ప్రజాగానం. సామాజిక ఉద్యమ గీతాలు, మీరే ప్రేరణ, మీరే సాధన (వ్యక్తిత్వ వికాసం), నేనిప్పుడు కమ్యూనిజానికి సొంతం (ఆరుద్ర) పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నిఖిలేశ్వర్ మాట్లాడుతూ.... ఒకే వేదిక పైన 6 పుస్తకాలను ఆవిష్కరించడం అరుదైన విషయమని, ఇది ఆయన ప్రతిభకు తార్కణం అన్నారు. అక్షరాల్లో జీవించిన వ్యక్తిగా ఇలాంటి పుస్తకాలు రాయడం గొప్ప పరిణామం అన్నారు. కవితాక్షరాలు ఎనాటికైన సజీవంగా ఉంటాయన్నారు. తన వ్యక్తిగత అనుభవాల నుంచి పుస్తకాలను రాయడం వల్ల పాటకులను విశేషంగా ఆకట్టుకుంటుందన్నారు. కాలకాలం ఉండేది కవిత్వం అని ఆ దిశగా కవిత్వం సాగాలని చెప్పారు. తెలంగాణ సాహితీ కార్యదర్శి కె. ఆనందాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ పసునూరి రవీందర్ .తెలంగాణ సాహితీ అకాడమీ కార్యదర్శి నమోజు బాలాచారి నవతెలంగాణ సంపాదకులు రాంపల్లి రమేష్, ప్రముఖ కవి యాకుబ్, సినిమా విమర్శకులు రెంటాల జయదేవ్, డాక్టర్ సలీమ, మోహన కృష్ణ, శరత్, సుదర్శి తదితరులు పాల్గొన్నారు.

# పేర్లు చెప్పను.. కానీ వాళ్ళ వల్ల బీజేపీకి చాలా నష్టం జరుగుతోంది



విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణ బీజేపీపై గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఆయన ఓ మీడియా ఛానల్ ప్రతినిధితో మాట్లాడారు. 'తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రాదు. ప్రతి నియోజకవర్గంలో, ప్రతి జిల్లాలో నా మనిషే అంటే, ఎన్నో ఏళ్ల నుండి ప్రాణం పెట్టి పనిచేసిన పాత కార్యకర్తలు ఎక్కడికి పోవాలి. బీజేపీ అధిష్టానం కూడా తెలంగాణ మీద దృష్టి పెట్టదు.. వాళ్ళు వేరే రాష్ట్రాలను చూసుకుంటారు. రాష్ట్రంలోని పెద్ద బాబులు చెప్పిందే అధిష్టానం వింటుంది. వాళ్ళ పేర్లు చెప్పలేను కానీ, వాళ్ళ వల్ల తెలంగాణ బీజేపీకి చాలా నష్టం జరుగుతుంది' అని రాజాసింగ్ తీవ్ర ఆరోపణలు చేశారు. కాగా, తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవిని మాజీ ఎమ్మెల్సీ రామచందర్రావుకు అప్పగించడాన్ని నిరసిస్తూ నిరసనగా రాజాసింగ్ బీజేపీకి గుడ్ బై చెప్పిన విషయం తెలిసిందే. వెంటనే ఆయన రాజీనామాను అధిష్టానం కూడా ఆమోదించింది. ఈ వ్యవహారం కమలం పార్టీలో కల్లోలానికి దారితీసింది. దాంతో తరచూ ఆయన పార్టీలో కష్టపడే వారికి న్యాయం జరగడం లేదని, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం కొంత మంది బీజేపీ నేతలకే ఇష్టం లేదంటూ రాజాసింగ్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ వస్తున్నారు. తాజాగా చేసిన వ్యాఖ్యలపై అధిష్టానం ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి.

# ఎల్బీనగర్- ఉప్పల్ మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్



విశ్వంభర, హైదరాబాద్: ఎల్బీనగర్– ఉప్పల్ మార్గంలో ఆదివారం సాయంత్రం భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అప్రమత్తమైన పోలీసులు వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టారు.

## గవర్నర్‌పై స్టాలిన్ విమర్శలు..

# మరోసారి బయటపడ్డ విభేదాలు

విశ్వంభర, చెన్నై: తమిళనాడు ప్రభుత్వానికి, ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవికి మధ్య కొంతకాలంగా అభిప్రాయ భేదాలు కొనసాగుతున్నాయి. తాజాగా అవి మరోసారి బహిర్గతం అయ్యాయి. ప్రతిపక్షాల కంటే గవర్నర్ చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని ఎంకే స్టాలిన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆదివారం సాంఘిక సంక్షేమ కార్యక్రమాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రతిపక్షాలు చేసే విమర్శలపై నాకు ఆందోళన లేదు. ఎందుకంటే రాజకీయాల్లో అవన్నీ సహజం. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియమించిన గవర్నర్ రవి.. వారి కంటే చౌకబారు రాజకీయాలు చేస్తున్నారు. రాజ్‌భవన్‌లో ఉండి అధికార డీఎంకేకు వ్యతిరేకంగా అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రం ప్రతిపాదించిన బిల్లులను ఆయన ఆమోదించరు. తమిళ గీతాన్ని అగౌరవపరుస్తారు. కానీ, రాష్ట్రంలో విద్య, శాంతి భద్రతలు, మహిళ భద్రతపై నిరాధారమైన ఆరోపణలు చేసి భయాందోళనలు సృష్టిస్తారు' అని ఆరోపించారు. ఈ సందర్భంగా తమిళనాడు దేశంలోనే అగ్ర రాష్ట్రమని కేంద్ర గణాంకాలే చెబుతున్నాయని స్టాలిన్ పేర్కొన్నారు. దీంతో ప్రజా వేదికలపై గవర్నర్ అసహనం వెళ్లగక్కుతున్నారని



విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తమ గవర్నర్ ద్వారా తమిళనాడులో చౌకబారు రాజకీయాలు చేస్తోందన్నారు. ఇటీవల జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ప్రసంగించిన రవి.. రాష్ట్రంలో మహిళల భద్రత, యువత మాదకద్రవ్యాల వినియోగం సహా పలు అంశాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలను డీఎంకే నేతలు నాడే తిప్పికొట్టారు. తాజాగా సీఎం స్టాలిన్ కూడా స్పందించినట్లైంది.

# విశాఖను ముంచెత్తిన వర్షం.. రహదారులు జలమయం

విశ్వంభర, విశాఖపట్నం: అల్పపీడన ప్రభావంతో విశాఖలో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి కురిసిన వర్షానికి విశాఖలో 5 సెం.మీ, గాజువాకలో 6 సెం.మీ వర్షపాతం నమోదైంది. గాజువాక డైరీ కాలనీ, రిక్షా కాలనీ, హెచ్‌బీ కానలీ, రామచంద్ర కాలనీలో మూడు అడుగుల మేర వరదనీరు చేరింది. విశాక జ్ఞానాపురం, చిలకపేట, వన్‌టౌన్ ఏరియా, తదిరత ప్రాంతాల్లో రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. హనుమంతవాక, తాడిచెట్లపాలెం, గాజువాక కొండవాలు ప్రాంతాలు వర్షం ధాటికి వణుకుతున్నాయి.విశాఖ దక్షిణ నియోజక వర్గ శాసన సభ్యుడు వంశి కృష్ణ శ్రీనివాస్ యాదవ్ విశాఖలోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. బుల్డోజర్‌తో దగ్గరుండి కాలువ పూడిక తీయించారు. వర్షాల వల్ల ప్రజలు ఇబ్బంది పడకుండా అధికారులు సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీర ప్రాంతంలో అల్పపీడనం కొనసాగుతోందని విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మరో 24 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశముందని, ఈ నెల 19న దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీర ప్రాంతం మధ్య తీరం దాటవచ్చని వాతావరణ



కేంద్రం డైరెక్టర్ భారతి సవ్వడి తెలిపారు. దీని ప్రభావంతో ఏపీలో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. విశాఖ, అనకాపల్లి, బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, పశ్చిమ గోదావరి జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణ, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

# యోగి ఆదిత్యానాథ్‌ను కలిసిన ఎమ్మెల్యే పూజా పాల్..



విశ్వంభర, లక్నో: ఉత్తర్‌ప్రదేశ్‌లో మాఫియా ఆగడాలపై ఉక్కుపాదం మోపుతున్నారంటూ సీఎం యోగి ఆదిత్యనాథ్‌పై ప్రశంసలు కురిపించి పార్టీ నుంచి బహిష్కరణ ఎదుర్కొన్నారు ఎస్పీ ఎమ్మెల్యే పూజా పాల్ . తాజాగా ఆమె యూపీ సీఎంతో భేటీ అయ్యారు. ప్రస్తుతం ఇది చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర అసెంబ్లీలో ఇటీవల విజన్ డాక్యుమెంట్ 2047పై సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ ఎమ్మెల్యే పూజా పాల్ మాట్లాడుతూ.. యోగిపై ప్రశంసలు కురిపించారు. తన భర్త (బీఎస్పీ మాజీ ఎమ్మెల్యే రాజు పాల్) హత్య కేసులో నిందితుడు అతీక్ అహ్మద్ ఆగడాలపై చర్యలు తీసుకోవడంతో తనకు న్యాయం జరిగిందన్నారు. నేరగాళ్లపై యోగి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. నేరాల అదుపు కోసం తీసుకుంటున్న చర్యలపై రాష్ట్రం మొత్తం ముఖ్యమంత్రి వైపే చూస్తోందన్నారు. ఈ వ్యాఖ్యలను పార్టీ తీవ్రంగా పరిగణించింది. పూజా పాల్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు, క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడ్డరంటూ ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆమెపై వేటు వేశారు. ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ ఆమె చర్యలు పార్టీకి నష్టం కలిగించాయన్నారు. ఈ క్రమంలోనే శనివారం ఆదిత్యానాథ్ అధికారిక నివాసంలో వీరి భేటీ జరిగింది. వీరి సమావేశానికి సంబంధించిన ఎలాంటి విషయాలు బయటకు రాలేదు. ఈ భేటీ ప్రస్తుతం రాజకీయంగా తీవ్ర చర్చకు దారి తీసింది.

# చిక్కడపల్లిలో చోరీ కేసును ఛేదించిన పోలీసులు

విశ్వంభర, హైదరాబాద్: చిక్కడపల్లిలో చోరీ కేసును పోలీసులు ఛేదించారు. వివేక్‌నగర్‌కు చెందిన నారాయణ, రాజేశ్వరి దంపతులు. నారాయణ మిథానిలో, రాజేశ్వరి బ్యాంకులో పనిచేసి ఉద్యోగవిరమణ పొందారు. వారి ఏకైక కుమార్తె అమెరికాలో నివసిస్తున్నారు. నారాయణ దంపతులకు వివేక్‌నగర్‌లో మూడంతస్తుల సొంత భవనం ఉండగా రెండో అంతస్తులో వారు నివసిస్తున్నారు. మిగతా వాటిని బంధువులకు అద్దెకు ఇచ్చారు. వృద్ధ దంపతులు ఈనెల 15న రాత్రి తలుపులు గడియ పెట్టకుండానే నిద్రలోకి జారుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 4గంటల సమయంలో లేచి చూడగా.. బెడ్‌రూంలోని బీరువా తలుపులు తెరిచి ఉండటం గుర్తించారు. అందులో దాచిన 36 తులాల బంగారు ఆభరణాలు, రూ.35వేల నగదు కనిపించలేదు. నారాయణ ఫిర్యాదుతో.. చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మూడంతస్తుల భవనానికి సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించగా.. కర్ణాటకకు చెందిన ఓ పాత నేరస్థుడు అదే రోజు రాత్రి స్థానికంగా సంచరించినట్టు గుర్తించారు. దార్ల నేహేమియా,




బంగారాన్ని అమ్మేందుకు సహకరించిన రాయుడు చైతన్య సాయికుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులిద్దరిపై గతంలో వేర్వేరుగా పదుల సంఖ్యలో చోరీ కేసులు నమోదయ్యాయి. నిందితుల నుంచి 25 తులాల బంగారం, రూ.23వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

# భద్రాచలం వద్ద 33.5 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం

విశ్వంభర, భద్రాచలం: భారీ వర్షాలతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో భద్రాచలం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈరోజు ఉదయం 11 గంటలకు గోదావరి నీటిమట్టం 33.5 అడుగులకు చేరుకుంది. ఈ వరద కారణంగా భద్రాచలం వద్ద నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గోదావరి నీటిమట్టం పెరగడంతో స్నాన ఘట్టాల వద్ద చాలా మెట్లు వరద నీటిలో మునిగాయి. కల్యాణకట్ట వరకు వరద నీరు వచ్చి చేరింది. గోదావరిలో స్నానాలు ఆచరించే భక్తులు లోపలికి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.



# యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి వివాహవేడుకకు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి



విశ్వంభర, హైదరాబాద్: శంషాబాద్ జీఎంఆర్ ఎరీనాలో జరిగిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జెక్కిడి శివచరణ్‌రెడ్డి వివాహ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. వధువరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. సీఎంతోపాటు పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు వేడుకకు హాజరయ్యారు.

# ఆస్పత్రిలో చేరిన నవీన్ పట్నాయక్

విశ్వంభర, నేషనల్ బ్యూరో: బిజూ జనతాదళ్ అధ్యక్షుడు, ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆస్పత్రిలో చేరారు. వయసు రీత్యా సమస్యలతో ఆయన భువనేశ్వర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. "శనివారం రాత్రి తనకు అసౌకర్యంగా ఉందని పట్నాయక్ చెప్పారు. దీంతో పలువురు వైద్యులు ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు" అని నేతలు తెలిపారు. ఆయన డీహైడ్రేషన్‌తో బాధపడుతున్నారని.. ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, చికిత్సకు స్పందిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఇదిలా ఉండగా.. నవీన్ పట్నాయక్ ఇటీవల ముంబయిలో సర్వికల్ ఆర్థరైటిస్‌కు శస్త్రచికిత్స చేయించుకున్న విషయం తెలిసిందే.



# బహుజనుల ధీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

## నేడు ఆయన 375వ జయంతి

పీడితులు, బహుజనులు ఏకమై పోరాడితే రాజ్యాధికారం సాధించవచ్చుని నిరూపించిన సామాన్యుడు, గొప్ప సామాజిక బహుజన విప్లవకారుడు, కుల, మత, జాతి వర్గ విభేదాలు లేని సమాజం కోసం దాదాపు 350 ఏండ్ల కిందనే కృషి చేసిన బహుజన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. ఆధిపత్య అగ్రకుల పాలకులు బహుజనులను అణగద్రొక్కుతున్న 17వ శతాబ్దంలోనే స్వీయ సైన్యంతో దక్కన్‌పై బహుజనుల సంక్షేమ బాధ్యత తీసుకొని తొలి బహుజన రాజ్య స్థాపన చేసిన గొప్ప వీరుడు, తొలి బహుజన రాజు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. ఖిలాష్ పూర్ కేంద్రంగా చేసుకొని మొఘల్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన ఘనుడయన. ఒక సామాన్యుడు ఆధునిక ఆయుధాలను సమకూర్చుకొని రాజ్యాధినేతలనే ఎదురించిన ఘనత మన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ది. మహాత్మా జ్యోతిరావు పూలే కంటే ముందే సామాజిక న్యాయం అమలు చేసిన గొప్ప సామాజిక విప్లవకారుడు. రాచరికపు వ్యవస్థ నీడలో అగ్రకులాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా, జమీందార్లు, జాగీర్దాల అరాచకాలను సహించలేక కడుపు మండి కత్తి పట్టిన వీరుడతను. ఖిలాషాపూర్‌ను కేంద్రంగా చేసుకొని మొఘలుల ఆధిపత్యాన్ని ఎదిరించి గోల్కొండ కోటపై జెండా ఎగురవేసిన బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. ఛత్రపతి శివాజీ ఉత్తర భారతంలో విదేశీయుల నుంచి దేశాన్ని కాపాడి సంప్రదాయ బూజు పట్టిన వ్యవస్థపై తిరుగు బావుటా ఎగురవేసి, స్వరాజ్యాన్ని సాధిస్తున్న సమయంలో, దక్షిణాదిన భూస్వామ్య, దోపిడీ వ్యవస్థపై తిరుగుబాటు చేసి తెలంగాణ గడ్డపై దళిత, బహుజన, మైనార్టీలతో కలిసి ప్రజారాజ్యాన్ని నిర్మించిన వాడు పాపన్న. అందుకే మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ సమకాలికుడిగా పాపన్నను చెబుతారు. వరంగల్ జిల్లా ఖిలాషాపూర్ నుంచి..కాకతీయుల పాలన ముగిసిన 300 ఏండ్ల తర్వాత 1650 నుంచి 1709 వరకు సర్దార్ సర్వాయి పాపన్న ప్రస్థానం ఉంది. పాపన్న 1650 ఆగస్ట్ 18న వరంగల్ జిల్లా ఖిలాషాపూర్ గ్రామంలో గౌడ కులంలో పుట్టారు. పాపన్న తండ్రి చిన్నతనంలోనే చనిపోతే తల్లి సర్వమ్మ అన్నీ తానై పెంచింది. పాపన్న కల్లు గీత వృత్తి కొనసాగిస్తూ యుక్త వయసులోనే భూస్వాములు, దేశముఖ్ ల దాష్టీకాలను సహించలేక, మూఢ సాంప్రదాయాలను ఎదిరించి పోరుబాట పట్టాడు. అగ్ర కులపెత్తనాన్ని అణచాలంటే ఒక్కరితో సాధ్యం కాదని గుర్తించి, మొత్తం బహుజన కులాలను ఏకం చేయాలనుకున్నాడు. తన స్నేహితులైన చాకలి సర్వన్న, మంగలి మాసన్న, కుమ్మరి గోవిందు, జక్కుల పెరుమాళ్లు, దూదేకుల పీరు, కొత్వాల్ మీర్ సాహేబ్ తో కలిసి చుట్టూ జరుగుతున్న విషయాల గురించి చర్చించేవాడు. వాళ్లకు తన మార్గం, భవిష్యత్తు కార్యాచరణను వివరించి గెరిల్లా సైన్యాన్ని తయారు చేసుకున్నాడు. ధనవంతులు, జమీం దారులపై రహస్య దాడులు చేసి కొల్లగొట్టిన ధనంతో మెరుగైన ఆయుధాలను సమకూర్చుకున్నాడు. దొరలు, భూస్వాముల వల్ల బాధలు పడుతున్న వారికి విముక్తి కలిగించి వారితో తన సైన్యాన్ని విస్తరించుకున్నాడు. ఈ క్రమంలోనే ఉత్తర తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో అగ్రకుల భూస్వా ములు, ధనవంతుల గడీలు, కోటలపై దాడులు ప్రారంభించాడు. ప్రజల శ్రమను దోపిడీ చేసి కోటల్లో దాచుకున్న ఆస్తులను కొల్లగొట్టి పేద ప్రజలకు పంచిపెట్టి బందీలుగా మగ్గుతున్న అణగారిన వర్గాలను విడిపించాడు. ఈ నేపథ్యంలో పాపన్న సైన్యం అతి తక్కువ సమయంలోనే 12 వేలకు చేరింది. సైనిక శిక్షణ, యుద్ధ విద్యలను నేర్చుకోవడానికి పాపన్న వ్యూహాత్మ కంగా అడుగులు వేశాడు. శిక్షణ పొందిన సైన్యం ద్వారా చిన్నచిన్న సంస్థా నాలు, గడీలపై మెరుపుదాడులు చేసి వాటిని ఆక్రమించుకుంటూ, తనసొంత ఊరు ఖిలాషాపూర్ ను రాజధానిగా చేసుకుని, 1675లో సర్వాయిపేట కేంద్రంగా తన రాజ్యాన్ని స్థాపించి దుర్భేద్యమైన కోట నిర్మించాడు.

**పాపన్న రాజ్య విస్తరణ..**

పాపన్న జైత్రయాత్ర అప్రతిహతంగా కొనసాగి ఆ తర్వాత కరీంనగర్, హుస్నాబాద్, ఎలగందుల రాజ్యాలను జయించాడు. ఇలా రాజ్య విస్తరణ చేసుకుంటూ, తాటికొండలో నిర్మించిన కోట ద్వారా సైనిక కార్యకలాపాలను ఉధృతం చేసి వరంగల్, నల్గొండ జిల్లాల్లోని రాజ్యాలను గెలిచాడు. ఎత్తైన గుట్టలు ఉన్న ప్రాంతాలనే రక్షణ దుర్గాలుగా ఎంచుకున్నాడు. కనుచూపు మేరలో శత్రువు కదలికలను కనిపెట్టేలా కోటల నిర్మాణం చేశాడని, ఆధునిక ఆయుధాలు వాడినట్లు ఆ కోటలపై ఉన్న ఆనవాళ్లను బట్టి తెలుస్తోంది. రాజనీతిలోనూ పాపన్న ఏ చక్రవర్తికీ తీసిపోడు. స్వయం సమృద్ధి కోసం ఎన్నో సంస్కరణలు చేశాడు. తాటికొండ లాంటి ప్రాంతాల్లో వ్యవసాయ అభివృద్ధికై చెక్ డ్యామ్ లను కట్టించాడు. కులవృత్తులను ప్రోత్సహించాడు. హుస్నాబాద్ లో ఎల్లమ్మ చెరువును తవ్వించాడు. ఎల్లమ్మ ఆలయాన్ని నిర్మించాడు. ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో ఎన్నో కోటలు, చెరు వులు నిర్మించారు. 1678 వరకు తాటికొండ, వేములకొండలను అధీనంలోకి తెచ్చుకుని విజయ దుర్గాలను నిర్మించాడు. 1708 వరకు మొఘల్ ఏలుబడిలో ఉన్న ఓరుగల్లు, భువనగిరి కోటలను చేజిక్కించుకుని, భువనగిరి, వరంగల్, కొలనుపాక, జఫర్ ఘడ్, చేర్యాల్, బైరానుపల్లి, నల్గొండ, కరీంనగర్, హుస్నాబాద్, హుజూరాబాద్ మొదలు మెదక్ జిల్లా పాపన్నపేట వరకు ఉన్న ప్రాంతాలను తన సామ్రాజ్యంగా చేసుకుని పాలించాడు. ఇలా సర్వాయిపేట కోటతో మొదలుపెట్టి తన అధీనంలోకి వచ్చిన ప్రాంతాల్లో 20 కోటలను నిర్మించాడు. 1700%-%1705 మధ్యకాలంలో ఖిలాషాపూర్లో మరో దుర్గం నిర్మించాడు. యుద్ధ విద్యల్లో ఆరితేరిన సైన్యాన్ని సమకూర్చుకున్న పాపన్న ఖిలాషాపూర్ కేంద్రంగా రాజ్యపాలన చేస్తుండటంతో ఈ ప్రాంతాల నుంచి రావలసిన పన్నులు తగ్గిపోవడంతోపాటు రాజ్యాలు ఒక్కొక్కటి చేజారుతుండటంతో అప్పటి ఢిల్లీ సుల్తాన్ ఔరంగజేబుకు కలవరం కలిగించింది. పాపన్నను బంధించాలని అప్పటి కొలనుపాక పాలకుడు రుస్తుందిల్ ఖాన్ ను ఆదేశిం చడంతో తన సైన్యాధినేత ఖాసింఖాన్ ను పాపన్నపై దాడికి పంపించాడు. ఖిలాషాపూర్పై దాడికి వచ్చిన ఖాసింఖాన్ను హతమార్చి అతడి సైన్యాలను పాపన్న తిప్పికొట్టాడు. కొంత కాలం తర్వాత ఏకంగా రుస్తుందిల్ ఖాన్ రంగంలోకి దిగి, పాపన్న సైన్యానికి పెద్ద ఎత్తున నష్టం చేసి, ఖిలాషాపూర్ కోటను నేలమట్టం



చేశాడని, అనంతర కాలంలో తిరిగి పాపన్న ఖిలాషాపూర్ కోటను మరింత శత్రుదుర్భేద్యంగా మార్చాడు.

ఔరంగజేబు మరణానంతరం దక్షిణాదిన మొఘల్ పాలన మరింత పట్టు తప్పడంతో, పాపన్న గోల్కొండ కోటపై దాడికి పథకం వేస్తున్న తరుణంలో, మొఘల్ రాజు బహదూర్ షా పాపన్నను స్వయం పాలకునిగా సంధికి ఆహ్వానించాడు. సంధికి వచ్చిన పాపన్నను ఎర్ర తివాచీ పరచి గౌరవంగా ఆదరించారని ఆంగ్ల చరిత్రకారుడు టీడబ్ల్యూ హేగ్ తన రచనల్లో పేర్కొన్నారు. కొంత కప్పం చెల్లించి గోల్కొండ కోటకు రాజుగా కొనసాగవచ్చని బహదూర్ షా చేసిన ప్రతిపాదనకు అంగీకరించిన పాపన్న, మొఘల్ చక్రవర్తి కోరిన కప్పాన్ని చెల్లించి గోల్కొండ కోటపై బహుజనుల జెండాను ఎగురవేశాడు. అయితే బహుజనుడైన పాపన్నను గోల్కొండ కోటకు రాజుగా చేయడాన్ని జమీందార్లు, దేశముఖ్ లు, జాగీర్దార్లు జీర్ణించుకోలేకపోయారు. పాపన్నను ఎలాగైనా రాజ్యాధికారం నుంచి తప్పించాలని కుట్రలు పన్నారు. మొఘల్ చక్రవర్తుల రాజ్య విస్తరణను అడ్డుకుని 30 ఏండ్లు తెలంగాణ గడ్డని పాలించిన పాపన్న విజయాలకు బెదిరిపోయిన సుభేదార్లు, మొఘల్ తొత్తులైన భూస్వాములు కుట్ర పన్ని పాపన్న పరిపాలనలో తాము కొనసాగలేమని, ఆయనను పదవి నుంచి తప్పించాలని బహదూర్ షాను వేడుకోవడంతో, పాపన్నను బంధించి తేవాలని ఆయన సైన్యాన్ని ఆదేశించారు. దీంతో యూసఫ్ ఖాన్ రుజ్బహాని నాయకత్వంలో పెద్ద ఎత్తున మొఘల్ సైన్యం పాపన్నపై మూకుమ్మడిగా దాడికి దిగగా, ఇరు సైన్యాల మధ్య భీకర పోరులో పాపన్న తీవ్రంగా గాయపడి తప్పించుకున్నాడు. తనకు సురక్షిత ప్రాంతంగా భావించి హుస్నాబాద్ ప్రాంతానికి వచ్చి అక్కడ ఎల్లమ్మ గుడిని కట్టించి, రహస్యంగా కల్లు గీత కార్మికుడిగా జీవనం సాగించాడని చరిత్రకారులు చెపుతున్నారు. ఈ తరుణంలో ఒక ద్రోహి అందించిన సమాచారంతో మొఘల్ సైన్యం ఆయనను గుర్తించి బంధించడానికి ప్రయత్నించగా, శత్రువు చేతిలో మరణించడం ఇష్టం లేక పాపన్న ఆత్మహత్య చేసుకున్నాడని ప్రజల్లో ఒక కథనం ఉంది. మరో కథనం ప్రకారం 1709లో ఇరు సైన్యాల మధ్య జరిగిన పోరులో మొఘల్ సైన్యం ఆయనను బంధించి శిరచ్ఛేదనం చేసి తలను బహదూర్ షాకు కానుకగా ఢిల్లీకి పంపి, పాపన్న మొండాన్ని గోల్కొండ కోటకు వేలాడ దీశారని మరో కథనం కూడా ప్రచారంలో ఉంది. వివిధ కథలు ప్రచారంలో ఉన్నా ఆయన ఒక యోధుడిగా తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు. సర్వాయి పేట లో పాపన్న గౌడ నిర్మిం చిన కోటను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి 4.5 కోట్ల రూపాయలు ప్రభుత్వం విడుదల చేసింది. పాపన్న తవ్వించిన ఎల్లమ్మ చెరువు ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తుంది. సర్వాయి పాపన్న గౌడ్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుంది. పాపన్న గౌడ్ స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శంగా ఉండేలా ట్యాంక్ బండ్ పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ,మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో శంకుస్థాపన చేసుకుంటున్నాం. ప్రతి గ్రామగ్రామాన సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాలు ఏర్పాటు చేసి ఆయన చరిత్ర భవిష్యత్ సమాజానికి తెలిసేలా ప్రభుత్వం కృషి చేస్తుంది.



నాగరాజు
పిఆర్వో
(రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి)

# "దళితవాడ వేదనకు కవితా వెలుగు కవాతు మద్దూరి నగేష్ బాబు"

తెలుగు కవిత్వం వైయుక్తిక భావనలు, వర్ణనల నుండి వర్గసామ్యంవైపుకు, పయనించడంలో స్థానికసమస్యలకంటే ప్రపంచ మార్పులు, పాశ్చాత్య ప్రభావమే స్పష్టంగా కనిపిస్తుంది. మనస్తత్వశాస్త్రం ప్రకారం తెలిసిన విషయం నుండి తెలియని విషయం వైపుకు మానవ మెదడు నేర్చుకోవ డానికి ప్రయత్నం చేస్తుంది. సంప్రదాయ పౌరాణిక ప్రతీకలతో శ్రీశ్రీ ప్రాపంచిక అభ్యుదయ కవిత్వాన్ని పరిచయం చేస్తూ కవిత్వం రాశాడు. ఈ కవిత్వంలో పాశ్చాత్య పోకడతో కొత్త ఆశలే అధికంగా ఉన్నాయి. పారిశ్రామిక విప్లవం, ప్రపంచ యుద్ధాలు, భారతదేశ స్వాతంత్ర్యం, సామ్యవాద ప్రభుత్వ ఆలోచనలు, ముఖ్యంగా ఆంగ్ల భాష ఆనాటి కవిత్వానికి ప్రేరణగా నిలిచాయి. తరువాత కాలంలో అదే మూసగా రాసిన కవులకు పెద్దగా ఆదరణ లభించలేదు. ఇది ఆలోచించవలిసి నవిషయం. నిజానికి స్థానికతను అర్థం చేసుకున్న సాహిత్యమే నిలబడుతుంది. కళలు తాత్కాలికంగా ఆధునికత పేరుతో తొక్కివేయబడినా స్థానిక మాధుర్యమే వేరు. ప్రజల భాష, బాధలు, అనుభూతులు, చరిత్ర, సంస్కృతి సాహిత్యలోకి చేరి ప్రజలవైనపుడు ఆ సాహిత్యానికి, కళలకు మంచి ఆదరణ సహజంగానే దక్కుతుంది. భారతదేశానికి సామ్యవాదం కంటే అంతరాలు లేని సమసమాజ స్థాపన కావాలని డా. బి. ఆర్. అంబేద్కర్ ఇచ్చిన పిలుపును అర్థం చేసుకుని రాసిన కవి త్వం వర్గసమాజం గురించి కాకుండా వర్ణసమాజం గురించి మాట్లాడడం మొదలు పెట్టింది. శ్రీశ్రీ పౌరాణిక ప్రతీకలను సామ్య, ప్రతిసామ్య పద్ధతిలో కవిత్వాన్ని రాస్తే, మద్దూరి నగేష్ బాబు పౌరాణిక ప్రతీకలను ధ్వంసం చేసి, కొత్త సాహిత్య పునాదులకు బీజం వేశాడు. కులవివక్ష పునాదులను పెకిలిస్తేనే అభ్యుదయ సమానత్వానికి, సమసమాజానికి బాటలు పడతాయని కొత్త దారులు తీశాడు. దళిత వివక్షను పౌరాణిక ప్రతీకలతో చెప్పడమే కాదు, దళిత ప్రతీకలతో పౌరాణిక వర్ణవ్యవస్థను బోనులో నిలబెట్టాడు. దళితవాడ వేదనకు వెలుగు కవాతు మద్దూరి నగేష్ బాబు. "వెలివాడ, రచ్చబండ (దీర్ఘ కవిత), లోయ, మీరేవుట్లు, నరలోక ప్రార్ధన, పుట్ట, గోదావరి (దీర్ఘ కవిత), నిశాని (ధిక్కార కవిత), ఊరువాడ (సంకర కవిత)" వంటి రచనల్లో అతని కవిత్వం ప్రతీకాత్మకం.

**అతని ప్రతీకలు కవితాత్మకంగా సాగుతాయి.**


మద్దూరి నగేష్ బాబు కవిత్వం అచ్చమైన దేశీ కవిత్వం. భాష, అనుభవా లు, అనుభూతులు, భావోద్వేగాలు తరతరాలుగా తమ సమాజం అనుభవి స్తున్న క్షోభనుండి పుట్టింది. ఆవేదనకు ఆలోచన తోడై ఆశయంగా మారిన కవిత్వం మద్దూరి నగేష్ బాబు కవిత్వం. తెలంగాణ దళితకవిత్వం, ఆంధ్రాప్రాంతపు దళిత కవిత్వంతో పోల్చినపుడు వస్తువు, భావప్రకటన తీవ్రత, ఆశయాల్లో పెద్దగా మార్పేమీ లేకున్నా, కవిత నిర్మాణం, ప్రతీకా త్మకత, సౌందర్యం, భాష, వ్యక్తీకరణ, శైలీప్రత్యేకతలు భిన్నంగా ఉంటాయి. మద్దూరి నగేష్ బాబు కవిత్వంలో తరతరాల గోస, వేదన, దళితు లుగా వారి నిస్సహాయత, అణచివేత, పోరాటం, ఆత్మగౌరవం, చైత న్యం, ప్రశ్న, సమాధానం, వ్యంగ్యం, అలక, అన్యాయంపై ఆగ్రహం, దళితులుగా నిర్దేశించిన పురాణ సాహిత్యం, భావజాలంపై ఆవేశం ఎక్కువగా కనిపిస్తాయి. అతని కవిత్వంలో చెప్పే పద్ధతి సులువుగా, భాష సరళంగా, గొంతు తీవ్రంగా, ప్రకటితమయ్యే భావం స్పష్టంగా, భావోద్వేగం నవ్యంగా ఉండడం ఆయన కవితా లక్షణాలు. "వెత" కవితలో "...చేతి వేళ్ళకు బదులు శూన్యం కమ్ముకున్న/ గురుదక్షిణల చీకటి/ ముక్కూ చెవులకు బదులు వర్ణధర్మం కబళించిన/ ధర్మ సంస్థాపనల చీకటి/ దేవాలయపు తెరని/ నిట్టనిలువునా చీల్చిన చీకటి/..../ దేశం ఒళ్లంతా చీకటి గజ్జి/ మూగుతున్న ఖద్దరు ఈగలు/కాషాయ దోమలు/ కుల రాజకీయ చీమలు/ ..అంతటా ఒక యుద్ధమేదో జరుగుతున్నట్టు/ మోహరించిన ఆర్య చీకటి/....." ఈ కవిత చదువుతుంటే మనల్ని అల్లుకున్న వర్తమాన చీకట్లు గుర్తుకురాక మానవు. ఇదీ మద్దూరి నగేష్ బాబు కవిత్వంలో ఉన్న ప్రాసంగికత. ఇదే కవితలో "...ఏవీ వెలుగులేవీ?/ ఏవీ కిరనాలేవీ?/ ఏవీ...ఏవీ..వెన్నెల జలపాతాలేవీ?/ సూర్యుడా ఎక్కడ? ఎలా ఉంటాడు?/ చంద్రుడా ఎవడు వాడు?/ నక్షత్రాల అంటే ఏమిటి?/ ....ఈ తాటాకు భేతాళ కతల పుస్తకంలో అక్షరాలేవీ/ అసలీ అయిదో బిడ్డకి తల్లేదీ తండ్రేడీ?". ఈ కవిత్వంలో మెరుపులాంటి ప్రశ్నలు చదివితే, మరుపులో నున్న అనేక ఆలోచనలను అల్లకల్లోలం చేస్తుంది. ఇది చదివితే ఆవేశంతో కూడిన ప్రశ్న అతనే, ఆలోచనతో కూడిన జవాబు అతనే అనిపిస్తుంది. మద్దూరి నగేష్ తన కవిత్వంతో పాత బాటను మాన్పించి, కొత్తదారులు వేస్తాడు. కొత్త నడకలు నేర్పుతాడు. "అన్నీ ప్రశ్నలే/ అన్నీ సందేహాలే!/ అంతా మిధ్య అయిన వ్యవస్థలో/ ఏదీ జవాబు కాదు/ ఎక్కడా సమాధానం లేదు/ కళ్లుంటాయి/చూడనిస్తేనా/ దేవుళ్లొచ్చి పెరికేయరూ!/ నోళ్లుంటాయి/ తెరవనిస్తేనా....." ఇలా ఉంటుంది. "సెమించండి! దయుంచి సెమించండి!/మాకు సంతకాలు లేవు నాయనా వేలిముద్రలు తప్ప/ మాకు మాటలన్నా లేవు తండ్రీ క్షణ క్షణం పోవటం తప్ప/ యుగయుగాలనుండీ/ అన్నీ మూసుకుని తుడిసేసుకోని పోవటాలు తప్ప/సీది పిర్రలకి రాసుకోని పోవటాలు తప్ప/ మాకు బతుకు లేదు బాబూ సావు తప్ప/ మీ పొలాల్లో నత్తలం/ మీ సేలల్లో సెమట కాలవలం / మీ సేలల్లో ఎరువులం/ మీ గాదెల్లో గింజలం– మీ బాంచలం/ ....."అంటూ "పలకా బల పాలడిగినాం – సెమిం చండి/ ఏదేస పో డు/ కలల్లేనోడయ్యా– కలల్లేనోడు" ఉబలాటం కొద్దీ పుస్తకం పట్టుకున్నట్టు కల గన్నానని అంటాడు. ఇదీ ఈ కవితలో చెప్పేవి ధా నంలోని నవ్యత. మద్దూ రి కవితలో సామాజిక వివక్షను, అంతకు మించిన పీడనను బలంగా ప్రకటి స్తాడు. ఈ కవిత్వంలో మానవత్వాన్ని, మనిషితత్వాన్ని అడుగు ప్రజలలోనే వెతుక్కోవాలనే బోధ కనిపిస్తుంది. తరువాత బాధ, ఆ వెంటనే చైతన్యం కవితాప్రవాహంలో కొట్టుకు వస్తాయి.




"మీ కొట్టాలు సిమ్మటానికి/ మాపెళ్ళాల పక్కలమీంచి లేసొత్తాం గదయ్యా/ మీ సంటోడయినా వొచ్చి/ మా ఆడోళ్ళనీ మా తల్లుల్నీ లంజముండలని పిల్సినా/ సినబాబుగోరి సరసాలని మురుసు కుంటం గదయ్యా/ టౌనుల్లో మీరు తాగి తూలుతుంటే/ తిని – కొవ్వెక్కిన మీ ఇల్లాళ్ళు/ మమ్మల్ని ఆగం ఆగం జేసినా/ పళ్ళ బిగు వున వోర్సుకునే వాళ్ళం కదయ్యా/ ఆసంగతి తెలిసి/ మీరు మమ్మల్ని వేట కొడవళ్ళతో నరుకుతున్నా/ తలొంచి/ మెడొంచి/ సివరాకరికి మీరొత్తంటే/ మా సమాధి రాళ్ళు సైతం లేచి నిలబడతాయి గద్దోరా!/ ఒక సంగతడుగు తానూ....!/ మేమూ మడుసులమే గదయ్యా/.... అయినా/ బతుక్కి వొక్క పాలేగదయ్యా సత్తాం!/... ఇక ఇప్పటికయినా మేం నిలబడకపోతే/ ఇన్ని యుగాల తర్వాతయినా తలలెత్తకపోతే/ మేం మనుషులం ఎట్టా అవుతాం తండ్రీ/.. ఇప్పుడు/ నా జాతిమీద ప్రమాణం చేసి చెబుతున్నా/ మేం కొత్త మనుషులం / బోధివృక్షాల వేర్లలోంచి/ గయల గాయాల్లోంచి/ నీలిగబ్బి లాల దండై ఎగిరొస్తున్నాం/ భూమధ్య రేఖాప్రాంతపు మధ్యాహ్న సూర్య బింబాల్లా/మా కళ్ళూ తెరిచేశాం!" ఇలా కవిత్వంలో కవి యొక్క గొప్ప దిగులు, తీర్పుతో కవిత ముగుస్తుంది.

–శీలం భద్రయ్య, నల్లగొండ
9885838288

## ఈవిఎం మాయ బయటపడింది



ఆ ఎన్నికతప్పుఅని తేలింది. ఆ సంగతిని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తేల్చింది. బువానా లాఖు అనే ఒక గ్రామపంచాయతీ హర్యా నా రాష్ట్రంలోని పానిపట్ జిల్లాలోని ఆ పంచాయితీకి 2022 లో ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికలు బ్యాలెట్ తో కాకుండా ఈవిఎం లతో జరిగాయి. ఓట్లను లెక్కించిన ఎన్నికల అధికారులు కుల్‌దీప్ గెలిచాడని ప్రకటించారు. లెక్కింపును అనుమానించిన కుల్ దీప్ ప్రత్యర్థి మోహిత్ మాలిక్ న్యాయం కోసం సెషన్స్ కోర్టుకు వెళ్లారు. అక్కడ తనకు న్యాయం జరగదేమో అని ఆయన అనుమానిం చారు. న్యాయం కోసం ఏకంగా సుప్రీంకోర్టులోనే పిటిషన్ వేశారు. పిటిషన్‌ను కోర్టు అంగీకరించింది. విచారణ జరిపింది. సదరు ఈవిఎం లను తెప్పించింది. ఆ ఓట్లను లెక్కించింది. గెలిచాడు అని ఎన్నికల అధికారులు ప్రకటించిన అభ్యర్థి ఓడిపోయాడని లెక్కింపులో తేట తెల్లమైంది. గెలిచాడు అని ఎన్నికల అధికారులు ప్రకటించిన వ్యక్తి కంటే ఆయన సమీప ప్రత్యర్థి పిటిషన్ వేసిన వ్యక్తి కూడా అయిన మోహిత్ కి 51 ఓట్లు ఎక్కువగా వచ్చాయని తేలింది. దీంతో ఎన్నికల అధికారులు ప్రకటించిన అభ్యర్థి ఓడిపోయాడని సుప్రీంకోర్టు ప్రకటిం చింది. ఈ లెక్కింపు ప్రక్రియ ఆగస్ట్ 11 న జరిగింది. అంటే ఎన్నికల వ్యవస్థ ఓట్ల లెక్కింపును నిష్పక్షకంగా జరపలేదని తేలిపోయింది. ఎన్నికల అధికారులు తప్పు చేశారని తేలిపోయింది. దీంతో ఫలితం తారుమారై పోయింది. ఓడిపోయాడు అని ఎన్నికల అధికారులు ప్రకటించిన మోహిత్ ను ఎన్నికయ్యాడని కోర్టు ప్రకటించింది. దీంతో మోహిత్ ఆ గ్రామ సర్పంచ్ గా బాధ్యతలు తీసుకున్నారు. స్వతంత్ర దినం సందర్భంగా ఆగస్ట్15 వ తేదీన ఆ గ్రామ పంచాయితీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని కూడా ఆవిష్కరించారు. ఇదీ ఈవిఎంలతో జరిపిన, జరుపుతున్న నిష్పాక్షిక ఎన్నికల తంతు. చిన్న పంచాయితీ ఎన్నికలోనే తప్పుడు నిర్ణయాన్ని ప్రకటించిన ఈ ఎన్నికల వ్యవస్థ 140 కోట్ల జనా భా కలిగిన ఇంత విశాలదేశంలో ఈవిఎంలతో ఎన్నికలనిర్వహణ ఏ మేరకు నిష్పక్షకంగా జరపగలదో పౌరసమాజం, డెమాక్రాట్స్ లోతుగా ఆలోచించవలసి ఉన్నది.

గందె గోవర్ధన్

# యూరియా కోసం ఎందుకీ హైరానా?




భారతీయ వ్యవసాయ రంగాన్ని నేటికీ తీవ్రంగా వేధిస్తున్న సమస్య యూరియా కొరత. ప్రతి సారి సీజన్ వచ్చిందంటే చాలు రైతులు ఎరువుల దుకాణాల ముందు, వ్యవసాయ సహకార కేంద్రాల ముందు కిలోమీటర్ల మేర క్యూలో నిలబడి, రాత్రంతా మెలకువలగా ఉండి యూరియా కోసం పడిగాపులు కాసే పరిస్థితి, ఇది ఇప్పటి సమస్య కాదు ప్రతి సారి పునరావృతం అయ్యే పరిస్థితి. ఇది కేవలం రైతుల సమస్య మాత్రమే కాదు, దేశ ఆహార భద్రతకు, ఆర్థిక స్థితిగతులకు, పర్యావరణానికి పెనుముప్పుగా పరిగణించబడే సమస్యగా మారింది. కానీ ఇక్కడ ప్రశ్న ఏమిటంటే భూమిలో జీవ కణాలను క్షీణింపజేసే, మట్టిని నిస్సారంగా మార్చి నీటిని కలుషితం చేసి, గాలిని విషపూరితం చేసే యూరియాకి ఎందుకంత డిమాండ్?ఇది రైతు అవగాహన లోపమా? లేక ప్రభుత్వాల విధాన వైఫల్యమా?యూరియాకు అంత డిమాండ్ ఎందుకు?.. భారతదేశంలో యూరియా వినియోగం ఏటా 350 లక్షల టన్నులకుపైగా ఉంది. అందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు ముందువరుసలో ఉన్నాయి. రైతుల దృష్టిలో యూరియా లేకుండా వ్యవసాయం సాగదనే అపోహ బలంగా పాతుకుపోయింది. దీనికి ముఖ్య కారణాలు. యూరియా సబ్సిడీ వల్ల చాలా చౌకగా లభించడం. సులభంగా దొరకడం. పంట పచ్చగా మెరిసేలా "తక్షణ ప్రభావం" చూపడం వంటివి రైతుకు యూరియా వైపు ఆసక్తి చూపేలా చేస్తున్నాయి,అయితే శాస్త్రీయంగా చూస్తే రైతు వేసిన యూరియాలో కేవలం 35–40% మాత్రమే మొక్కలు గ్రహిస్తాయి. మిగతాది గాలిలో ఆవిరైపోయి గాలికాలుష్యానికి కారణమవుతుంది, లేదా భూగర్భ జలాల్లో కలసి నీటిని కలుషితం చేస్తుంది. దీని ఫలితంగా భూమి సారం తగ్గిపోవడం,పంట నాణ్యత క్షీణించడం,గ్రీన్‌హౌస్ గ్యాస్‌ల ఉద్గారం పెరగడం వంటివి జరుగుతాయి. భూగర్భ జలాల్లో నైట్రేట్ పెరగడం వలన పిల్లల్లో బ్లూ బేబీ సిండ్రోమ్ వంటి ఆరోగ్య సమస్యలు రావడం కూడా జరుగుతుంది .

**రైతుల అవగాహన రాహిత్యం..**

రైతులలో ఒక తప్పుడు అపోహ బలంగా పాతుకుపోయింది ఎక్కువ యూరియా వాడితే ఎక్కువ దిగుబడి వస్తుందని కానీ వాస్తవం ఏమిటంటే..యూరియా అధిక మోతాదు వాడటం వల్ల మొక్కలు బలహీనంగా మారుతాయి,చీడపీడల బెడద పెరుగుతుంది,మార్కెట్‌లో పంట నాణ్యత తగ్గుతుంది. సేంద్రియ ఎరువులు, జీవ ఎరువుల ప్రాముఖ్యతపై అవగాహన లేక రైతులు యూరియాపైనే ఆధారపడుతున్నారు. ఇది దీర్ఘకాలంలో రైతుకూ, పుడమికీ హానిని కలుగ చేస్తుంది.

**ప్రభుత్వాల వైఫల్యం..**

యూరియా సమస్యలో రైతు తప్పు ఒక్కటే కాదు. ప్రభుత్వాల తప్పిదాలు కూడా ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. సబ్సిడీ అసమతౌల్యం: యూరియాకు భారీ సబ్సిడీ ఇచ్చి క డి ఏ పి, యం ఓ పి, మైక్రో న్యూట్రియంట్స్ వంటి సబ్సిడీ ఇవ్వకపోవడం

**అవగాహన లోపం..**

సంతులిత ఎరువుల వాడకం గురించి రైతులకు అవగాహన కల్పించడంలో విఫలం కావడం

**ప్లానింగ్ లోపం..**

ప్రతి సీజన్‌లో యూరియా కొరత ఉంటుందని ముందుగానే తెలిసినా సరైన చర్యలు తీసుకోలేకపోవడం. రాజకీయ ప్రయోజనం: యూరియా సబ్సిడీని ఓట్ల కోసం వాడుకోవడం, దీర్ఘకాలిక పరిష్కారం కోసం ప్రణాళిక చేయకపోవడం. ప్రతి ఏడాది ప్రభుత్వం యూరియా సబ్సిడీ కోసం 1.5%–%2 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. ఈ డబ్బు రైతు శిక్షణ, జీవ ఎరువులు, సేంద్రియ వ్యవసాయ ప్రోత్సాహానికి వెచ్చిస్తే దేశం సుస్థిర వ్యవసాయ దిశగా ముందడుగు వేస్తుంది.

యూరియాకు ప్రత్యామ్నాయాలు..

నానో యూరియా: ఒక్క లీటర్ నానో యూరియా నలభై ఐదు కేజీల యూరియా బస్తాకు సమానం. దీని ద్వారా రవాణా, నిల్వ సమస్యలు తగ్గుతాయి. ఖర్చు తక్కువ, ఫలితం మెరుగ్గా ఉంటుంది. జీవ ఎరువులు: అజటోబాక్టర్, ఫాస్ఫరస్ సొల్యూబుల్ బ్యాక్టీరియా, మైకోరైజా, ట్రైకోడెర్మా, సూడోమోనాస్ వంటివి వాడటం వలన నేల సారం పెరిగి, పంట నాణ్యత మెరుగవుతుంది.

**సేంద్రియ ఎరువులు:**

గోమూత్రం, గో ఆధారిత ఎరువులు, వర్మీ కంపోస్ట్, బయో మాన్యూర్స్. నేలలో సేంద్రియ పదార్థం పెంచి దీర్ఘకాలిక సారాన్ని నిలబెడతాయి.

ఇంటిగ్రేటెడ్ న్యూట్రియంట్ మేనేజ్‌మెంట్: రసాయన, జీవ, సేంద్రియ ఎరువులను సమతుల్యంగా వాడితేనే సుస్థిర వ్యవసాయం సాధ్యం. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో చాలా మంది రైతులు నానో యూరియా, జీవ ఎరువులు వాడి మెరుగైన ఫలితాలు పొందుతున్నారు. భవిష్యత్ తరాల కోసం బాధ్యతగా ఉండడం అవసరం. ప్రతి సీజన్ లో యూరియా కోసం క్యూల్లో నిలబడటం రైతు సమస్యకు పరిష్కారం కాదు. రైతు దృష్టిలో ఎక్కువ యూరియా ఎక్కువ దిగుబడి అనే అపోహను పోగొట్టాలి. ప్రభుత్వాలు యూరియా సబ్సిడీని క్రమంగా తగ్గించి, జీవ ఎరువులు, సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహం ఇవ్వాలి. యూరియా సమస్య రైతు సమస్య మాత్రమే కాదు, భూమి, పంట, పర్యావరణం, భవిష్యత్ తరాల ఆరోగ్య సమస్య కూడా. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన జీవితం అందించాలంటే రైతులు ప్రభుత్వం, వినియోగదారులందరూ కలిసి జీవ, సేంద్రియ వ్యవసాయ దిశగా అడుగులు వేయాలి. ఇది కేవలం అవసరం మాత్రమే కాదు భవిష్యత్ తరాల ఆరోగ్యకరమైన జీవితానికి అందరి బాధ్యత.



జి. అజయ్ కుమార్/ వ్యవసాయ నిపుణులు

# టీమిండియా తదుపరి కోచ్ అతడే.. బ్యాట్లను జాగ్రత్తగా చూసుకునేది ఎవరంటే?

ఇంగ్లండ్ పర్యటన మధ్యలో భారత జట్టు ఎంపికపై విమర్శలు వెల్లువెత్తాయి. తొలి టెస్టు, లార్డ్స్ టెస్టులో ఓటమి ఎదురవ్వడంతో హెడ్‌కోచ్ గౌతం గంభీర్ పై వేటు పడుతుందనే వార్తలు వినిపించాయి. కానీ, మాంచెస్టర్‌లో డ్రా, ఓవల్‌లో చిరస్మరణీయ విజయంతో శుభ్‌మన్ గిల్ సేన సిరీస్ సమం చేసింది. దాంతో.. తర్వాతి కోచ్ ఎవరు? అనే ప్రశ్నకు కాస్త బ్రేక్ పడింది. కానీ.. మాజీ క్రికెటర్ ఛతేశ్వర్ పూజారా మాత్రం భావి కోచ్‌గా రవిచంద్రన్ అశ్విన్ ఉండనే ఉన్నాడుగా అని అంటున్నాడు. ఒక కోచ్‌కు ఉండాల్సిన అన్ని అర్హతలు అశ్విన్‌కు ఉన్నాయని.. అతడు కోచ్ అవుతాడనడంలో ఏమాత్రం సందేహమే లేదు అని చెబుతున్నాడీ వెటరన్. 'అశ్విన్ లెజెండరీ ప్లేయర్. మూడు ఫార్మాట్లలో ఆడిన యశ్ బ్యాటుతో, బంతితో ప్రత్యర్థులను ఇబ్బందిపెట్టాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో సుదీర్ఘ అనుభవం ఉన్న అతడు భారత జట్టుకు ఏదోఒకరోజు ప్రధాన కోచ్ అవుతాడు. ఆల్‌రౌండర్ అయిన యశ్‌కు కోచ్‌లో ఉండాల్సిన అన్ని లక్షణాలు ఉన్నాయి. తదుపరి టీమిండియా కోచ్ ఎవరు? అనే ప్రశ్నకు నా సమాధానం అశ్విన్. అందులో నాకెటువంటి సందేహం లేదు' అని పుజారా ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్ఫోతో వెల్లడించాడు. ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్ఫో ర్యాపిడ్ ఫైర్‌లో ఈ నయా వాల్ ఫటాఫట్ జవాబిచ్చాడు. మీరు ఏ భారత ఆటగాడితో రోజంతా గడపాలని అనుకుంటారు?.. విరాట్ కోహ్లీ, మీతో ఆడినవాళ్లలో ఎవరు రియాల్టీ షో ప్రారంభించాలని భావిస్తున్నారు?– శిఖర్ ధావన్. భారత జట్టుకు కోచ్ అయ్యే టీమ్‌మేట్ ఎవరు అశ్విన్. టేలర్ స్విఫ్ట్ కాన్సర్ట్‌కు హాజరయ్యే సహచరుడు ఎవరు? – కేఎల్ రాహుల్. అన్నిరకాల రికార్డులను బద్ధలు కొట్టే క్రికెటర్ ఎవరు? విరాట్ కోహ్లీ.. రోజంతా క్రికెట్ గురించే చర్చించే ఆటగాడు ఎవరు? –అశ్విన్.



తరచూ ఫోన్‌లో వీడియోలు చూసేది ఎవరు?రిషభ్ పంత్. బ్యాట్లను ఎంతో జాగ్రత్తగా చూసుకునేది ఎవరు? సచిన్ టెండూల్కర్. జట్టుకు రంగేసుకునే ప్లేయర్ ఎవరు ఎంఎస్ ధోనీ. సహచరులకు బెస్ట్ గిఫ్ట్‌లు ఇచ్చే క్రికెటర్ ఎవరు? రాహుల్ ద్రవిడ్. భారత్‌కు ఆడిన గొప్ప స్పిన్నర్లలో ఒకడైన అశ్విన్ హఠాత్తుగా తన కెరీర్ ముగించాడు. కెరీర్ అద్భుతంగా సాగుతున్న సమయంలో 2024 డిసెంబర్‌లో వీడ్కోలు పలికి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. ఆస్ట్రేలియా పర్యటన మధ్యలోనే గబ్బా టెస్టు అనంతరం ఇక సెలవంటూ మీడియా సమావేశంలో వెల్లడించాడు. ప్రస్తుతం అశ్విన్ ఐపీఎల్, తమిళనాడు టీ20 లీగ్ వంటి ఫ్రాంచైజ్ క్రికెట్ టోర్నీల్లో ఆడుతున్నాడు. గ్రేటెస్ట్ స్పిన్నర్‌గా పేరొందని అశ్విన్ .. మూడు ఫార్మాట్లలో 765 వికెట్లు పడగొట్టాడు. టెస్టుల్లో 537 వికెట్లు తీసిన అతడు అనిల్ కుంబ్లే (619 వికెట్లు) తర్వాత భారత అత్యధిక వికెట్ల వీరుడిగా రికార్డు నెలకొల్పాడు.

# ఐపీఎల్‌లో ఇక అలా కుదరదు.. షార్ట్ రన్‌పై బీసీసీఐ కీలక నిర్ణయం..!

ఐపీఎల్‌తో పాటు దేశవాళీ క్రికెట్‌లో పలు మార్పులకు శ్రీకారం చుడుతోంది భారత క్రికెట్ నియంత్రణ మండలి షార్ట్ రన్ పై, రిటైర్డ్ హర్ట్ అయిన బ్యాటర్లపై, వన్డే మ్యాచ్‌లో రెండు బంతుల వినియోగంపై కూడా కీలక నిర్ణయం తీసుకుంది బీసీసీఐ. ఐపీఎల్‌తో పాటు దేశవాళీ క్రికెట్‌లో పలు మార్పులకు శ్రీకారం చుడుతోంది భారత క్రికెట్ నియంత్రణ మండలి తీవ్రంగా గాయపడిన ఆటగాళ్లు మరితంగా గాయపడకుండా చూడాలనే ఉద్దేశంతో రీప్లేస్‌మెంట్ ప్లేయర్‌ను అనుమతించేందుకు బోర్డు పచ్చజెండా ఊపింది. అంతేకాదు షార్ట్ రన్ )పై, రిటైర్డ్ హర్ట్ అయిన బ్యాటర్లపై, వన్డే మ్యాచ్‌లో రెండు బంతుల వినియోగంపై కూడా కీలక నిర్ణయం తీసుకుంది బీసీసీఐ.మామూలుగా టీ20ల్లో.. ముఖ్యంగా ఐపీఎల్‌లో వికెట్లు పడుతుంటే ప్రధాన బ్యాటర్లు ఓవర్ చివరి బంతికి చివర సింగిల్ తీసేందుకు ప్రయత్నిస్తారు. టెయిలెండర్లు వికెట్ కాచుకోలేరు, బౌండరీలు బాదలేరు కాబట్టి వాళ్ల బదులు స్ట్రయిక్ తీసుకోవాలని కష్టమైనా సరే రెండు రన్స్ తీస్తుంటారు. ఈ క్రమంలో కావాలనే కొందరు నాన్ స్ట్రయికింగ్ క్రీజులో బ్యాటు పూర్తిగా పెట్టరు. దీన్నే షార్ట్ రన్‌గా పరిగణిస్తారు. ఇకపై షార్ట్ రన్ తీసి బ్యాటింగ్ చేద్దామనుకుంటే కుదరదని బీసీసీఐ తేల్చి చెప్పింది. బ్యాటర్లు ఉద్దేశపూర్వకంగానే షార్ట్ రన్ తీస్తే.. స్ట్రయికింగ్‌లో ఎవరు ఉండాలో ఫీల్డింగ్ జట్టు కెప్టెన్ నిర్ణయించేలా కొత్త నిబంధనను ప్రవేశపెట్టింది.ఐసీసీ ఈమధ్య వన్డేల్లో రెండు బంతుల నియమాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. బీసీసీఐ కూడా ఇదే విధానాన్ని అనుసరించనుంది. ఇకపై వన్డే మ్యాచుల్లో 34 ఓవర్ల తర్వాత ఒకే బంతిని



మార్చేందుకు అనుమతించనుంది. త్వరలో ప్రారంభం కాబోయే విజయ్ హజారే ట్రోఫీనుంచే ఈ నియమం అమల్లోకి వస్తుందని బీసీసీఐ వెల్లడించింది.అంతేకాదు ఎవరైనా రిటైర్డ్ హర్ట్‌గా డగౌట్‌కు వెళ్తే వాళ్లను మళ్లీ మైదానంలోకి అనుమతించబోమని బీసీసీఐ స్పష్టం చేసింది. అయితే.. క్లాజ్ 25.4.2 ప్రకారం రిటైర్డ్ హర్ట్ అయినవాళ్లకు వెసులుబాటు ఉంటుందని బోర్డు చెప్పింది. మామూలుగా అయితే రిటైర్డ్ హర్ట్ అయిన వాళ్లు ఇన్నింగ్స్ మధ్యలో లేదా చివర్లో బ్యాటింగ్‌కు వస్తుంటారు. కానీ, ఈ కొత్త నిబంధన రాకతో ఇకపై ప్రత్యర్థి కెప్టెన్ అనుమతించినా సరే వాళ్లు మైదానంలోకి వచ్చేందుకు రిఫరీ ఓకే చెప్పరు. ఈ నియమం అన్ని ఫార్మాట్లకు వర్తిస్తుందని బీసీసీఐ తెలిపింది.

# సూర్య, బుమ్రా రెడీ.. టాపార్డర్‌లో వీళ్లకు చోటు దక్కేనా..?



ఆసియా కప్ పోటీలకు భారత స్క్వాడ్ ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఓపెనింగ్ నుంచి మిడిలార్డర్, బౌలింగ్ యూనిట్ వరకూ ఎవరిని తీసుకోవాలి? అనే అంశంపై చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌లు ల్లగుల్లాలు పడుతున్నారు.ఆసియా కప్ పోటీలకు భారత స్క్వాడ్ ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఓపెనింగ్ నుంచి మిడిలార్డర్, బౌలింగ్ యూనిట్ వరకూ ఎవరిని తీసుకోవాలి? అనే అంశంపై చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌లు మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ మెగా టోర్నీకి సమతూకంతో కూడిన బృందం ఎంపిక ఇరువురికి సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో టీ20 సారథి సూర్యకుమార్ యాదవ్ ఫిట్‌నెస్ పరీక్షలో పాస్ అయ్యాడు. మరోవైపు.. ఇంగ్లండ్ పర్యటనలో మూడే టెస్టులే ఆడిన ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా సైతం తాను అందుబాటులో ఉన్నానని సెలెక్టర్లకు సమాచారమిచ్చాడు. దాంతో, ఆసియా కప్ స్క్వాడ్‌లో ఈ ఇద్దరూ ఉండడం ఖాయమనిపిస్తోంది.ఆసియా కప్ సమీపిస్తున్నందున భారత సెలెక్టర్లు ఆగస్టు 19న ముంబైలో సమావేశం కానున్నారు. బృందంలో ఎవరెవరు ఉండాలి? అనే విషయమై సెలెక్టర్లు వచ్చే వారం సమావేశంలో నిర్ణయం తీసుకుంటారు అని బీసీసీఐ విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ ప్రారంభం కానుంది. వచ్చే ఏడాది పొట్టి ప్రపంచ కప్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ టోర్నీని టీ20 పార్మాట్‌లో నిర్వహిస్తున్నారు. ఈ మెగా ఈవెంట్లో చిరకాల ప్రత్యర్థులు సెప్టెంబర్ 14న దుబాయ్ వేదికగా తలపడనున్నాయి. పొట్టి ఫార్మాట్‌కు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు వీడ్కోలు పలకడంతో టాపార్డర్ కోసం గట్టి పోటీ నెలకొంది. ముఖ్యంగా ఓపెనర్ స్థానం కోసం యశస్వీ జైస్వాల్, సంజూ శాంసన్, శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మలు బరిలో ఉన్నారు. ఇంగ్లండ్ పర్యటనలో అద్భుతంగా రాణించిన గిల్‌కే కెప్టెన్సీ అందించాలనే వాదనలు వినిపిస్తున్నాయి.

# బాబర్, రిజ్వాన్‌పై వేటు.. పాక్ సారథిగా సల్మాన్ అఘా..!



ఫామ్‌లేమితో తంటాలు పడుతున్న పాకిస్థాన్ స్టార్ ఆటగాళ్లపై వేటు పడింది. ఆసియాకప్ కోసం ఆ దేశ క్రికెట్ బోర్డు ప్రకటించిన స్క్వాడ్‌లో మాజీ సారథులు బాబర్ ఆజం , మహ్మద్ రిజ్వాన్‌లకు చోటు దక్కలేదు. మెగా టోర్నీకి సమయం దగ్గరపడుతుండడంతో ఆదివారం సెలెక్టర్లు 17 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేశారు. టీ20 ఫార్మాట్‌లో జరుగబోయే ఈ ఎడిషన్‌కు సల్మాన్ అఘాకెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.సీనియర్లు బాబర్, రిజ్వాన్ బదులు ఫఖర్ జమాన్ సయీం అయూబ్, సహిబ్జదా ఫర్హాన్‌లు టాపార్డర్‌లో ఆడనున్నారు. ఇక పేస్ బౌలింగ్ యూనిట్‌ను షాహీన్ అఫ్రిది, హ్యారిస్ రవుఫ్, స్పిన్ దళానికి మహమ్మద్ నవాజ్ నడిపించనున్నారు. ఆసియా కప్ కంటే ముందు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ గడ్డపై జరుగబోయే ముక్కోణపు సిరీస్‌లో పాక్ ఇదే స్క్వాడ్‌తో బరిలోకి దిగనుంది. ఆగస్టు 29న మొదలయ్యే ఈ టోర్నీలో ఆతిథ్య యూఏఈ, పాక్‌తో పాటు అఫ్గనిస్థాన్ పోటీపడనుంది.యూఏఈ గడ్డ మీద సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ ప్రారంభం కానుంది. ఈ టోర్నీలో చిరకాల ప్రత్యర్థులు సెప్టెంబర్ 14న దుబాయ్ వేదికగా తలపడనున్నాయి. ఈ ప్రతిష్ఠాత్మక ఈవెంట్‌ను దృష్టిలో ఉంచుకొని స్క్వాడ్‌లో భారీ మార్పులు చేసింది పాకిస్థాన్ బోర్డు. టీ20 వరల్డ్ కప్ నుంచి వరుసగా విఫలమవుతున్న సీనియర్లు బాబర్ ఆజం, మహమ్మద్ రిజ్వాన్‌లను పక్కన పెట్టేసింది. నిలకడగా రాణిస్తున్న కుర్రాళ్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆసియా కప్ స్క్వాడ్‌లోకి తీసుకుంది.

పాకిస్థాన్ స్క్వాడ్ : సహిబ్జదా ఫర్హాన్, సయీం అయూబ్, ఫఖర్ జమాన్, మొహమ్మద్ హ్యారీస్ (వికెట్ కీపర్), సల్మాన్ అఘా (కెప్టెన్), హసన్ నవాజ్, ఖుష్‌దిల్ షా, ఫహీం అష్రఫ్, హుస్సేన్ తలాట్, మహమ్మద్ నవాజ్, అబ్రార్ అహ్మద్, సూఫియాన్ మకీం, షాహీన్ అఫ్రీది, హారిస్ రవుఫ్, హసన్ అలీ, మహమ్మద్ వసీం, సల్మాన్ మిర్జా.

## భారీగా తగ్గిన బంగారం ధరలు..



ఆదివారంనాడు బంగారం ధరలు నిన్నటితో పోలిస్తే స్థిరంగా ఉన్నాయి. శ్రావణమాసంలో పసిడికి భారీగా డిమాండ్ ఉన్నప్పటికీ, ప్రపంచ మార్కెట్లలో నెలకొన్న పరిస్థితుల కారణంగా ధరలు స్వల్పంగా తగ్గుముఖం పడుతున్నాయి. గత వారం రోజులుగా గమనిస్తే, బంగారం ధరలు తగ్గుతూ వస్తున్నాయి.ప్రస్తుతం, 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర ?1,02,730 గా, 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర ?93,150 గా ఉంది. అలాగే, ఒక కేజీ వెండి ధర ?1,17,430 గా ఉంది. గత ఏడాది ప్రారంభం నుంచి బంగారం ధరలు రికార్డు స్థాయిలో పెరిగినా, ఇప్పుడు ఆల్–టైం రికార్డు స్థాయి కన్నా తక్కువలో ట్రేడ్ అవుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధం కారణంగా స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోవడంతో, పెట్టుబడిదారులు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు మళ్లుతున్నారు. గడిచిన ఆరు నెలల్లో గోల్డ్ ఈటీఎఫ్లలో పెట్టుబడులు పెరగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా బంగారానికి డిమాండ్ పెరిగి, ధరలు కూడా పెరిగాయి. ఆభరణాల ధరలు కూడా రికార్డు స్థాయికి చేరాయి. ముఖ్యంగా, 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర దాదాపు ?94,000 కు చేరుకుంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో, పసిడి ధరలు భవిష్యత్తులో ఎలా ఉంటాయో వేచి చూడాలి.

## గేమింగ్ కోసం మార్కెట్‌లో ఉన్న 5 బెస్ట్ మొబైల్స్ ఇవే!

స్మార్ట్ ఫోన్స్ కొనుగోలు చేసేటప్పుడు ఒక్కొక్కరు ఒక్కో ఫీచర్ ప్రధానంగా ఉండాలని అనుకుంటారు. కొందరు కెటమెరా కోరుకుంటే మరికొందరు స్టైలిష్‌గా ఉండాలని అనుకుంటారు. అలానే గేమింగ్ ప్రియులు కూడా ఉంటారు. అలా గేమ్స్ కోసం మంచి ఫోన్ తీసుకోవాలి అనుకునేవారికోసం మార్కెట్ లో ఉన్న 5 బెస్ట్ మొబైల్స్ గురించి తెలుసుకుందాం. గేమింగ్ కోసం తీసుకునేవారికి ఇది బెస్ట్ ఆప్షన్ అనే చెప్పాలి. ఈ ఫోన్ ధర ప్రస్తుతం రూ.55వేలు ఉంది. ఐకూ 13 ఫోన్ క్వాల్కమ్ లేటెస్ట్ పవర్ ఫుల్ చిప్ సెట్ స్నాప్ డ్రాగన్ 8 ఎలైట్‌తో పనిచేస్తుంది. ఇది అల్ట్రా ఫాస్ట్ ఆక్టా కోర్ ప్రాసెసర్ కాబట్టి గేమింగ్ కోసం బెస్ట్ ఫోన్ అనే చెప్పాలి. ఈ చిప్ సెట్‌తో పాటు క్యూ2 గేమింగ్ చిప్ కూడా ఫోన్ లో ఉంది.




## దిగ్గజ ఐటీ కంపెనీ మైక్రోసాఫ్ట్
# వర్క్ ఫ్రమ్ ఉద్యోగుకు షాక్

దిగ్గజ ఐటీ కంపెనీ మైక్రోసాఫ్ట్ వర్క్ ఫ్రమ్ ఉద్యోగుకు షాక్ ఇవ్వబోతున్నట్టు తెలుస్తోంది. 2026 జనవరి నుండి వారానికి మూడు రోజులు ఆఫీస్ నుండి వర్క్ చేయాలనే నిబంధన పెట్టబోతుందట. ఈ నిబంధన వల్ల మైక్రోసాఫ్ట్ రెడ్ మండ్ ప్రధాన కార్యాలయానికి దూరంగా ఉన్న ఉద్యోగులకు తిప్పలు తప్పవు. ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా ఈ కంపెనీలో 2,28,000 మంది పనిచేస్తే అందులో సగం మంది ప్రధాన కార్యాలయంలోనే పనిచేస్తున్నారు. ఇక ఇతర ఆఫీసుల్లో పనిచేసే ఉద్యోగులకు సైతం ఇబ్బందులు ఉంటాయి. ఓ నివేదిక ప్రకారం మైక్రోసాఫ్ట్ నాలుగు లేదా ఐదు రోజులు కూడా వర్క్ ఫ్రమ్ ఆఫీస్ నిబంధన విధించే అవకాశం ఉంది. అదే విధంగా ఎవరైనా వర్క్ ఫ్రమ్ ఆఫీస్ చేయలేమని అనుకుంటే కంపెనీకి రిక్వెస్ట్ చేసుకోవచ్చు. కానీ ఫైనల్ నిర్ణయం మాత్రం యాజమాన్యమే తీసుకుంటుంది. ఇదిలా ఉంటే కరోనా తరవాత చాలా కంపెనీలు ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. కరోనా ప్రభావం తగ్గిన తరవాత కూడా చాలా కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోమ్




ఇవ్వగా మూడు రోజులు ఆఫీసుకు రావాలనే కండిషన్ విధించాయి. ఇక ఇప్పుడు మైక్రోసాఫ్ట్ కూడా అదే దారిలో వెల్లబోతున్నట్టు కనిపిస్తోంది. దీంతో ఇంతకాలం హ్యాపీగా ఇంటి వద్ద నుండే పనిచేసిన ఉద్యోగులకు ఇప్పుడు మూడు రోజులు ఆఫీసు కష్టాలు తప్పవు.

# టాబ్లెట్ పీసీ మార్కెట్లో యాపిల్ హవా



న్యూఢిల్లీ, : దేశీయ టాబ్లెట్ పీసీ మార్కెట్ శరవేగంగా విస్తరిస్తున్నది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో పీసీ మార్కెట్ 20 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నదని, దీంట్లో మూడోవంతు పీసీలు యాపిల్ కంపెనీకి చెందినవే అమ్ముడుకావడం విశేషమని సైబర్‌మీడియా రీసర్చ్ తన నివేదికలో వెల్లడించింది. జూన్ త్రైమాసికంలో యాపిల్‌కు చెందిన ఐపాడ్ అమ్మకాలు ఏడాది ప్రాతిపదికన 10 శాతం చొప్పున పెరిగాయని తెలిపింది.దేశీయ టాబ్లెట్ మార్కెట్లో 30 శాతం మార్కెట్ వాటాతో యాపిల్ తన తొలి స్థానాన్ని నిలపెట్టుకున్నది. ఇటీవల మార్కెట్లోకి విడుదలైన ఐపాడ్ 11 సిరీస్‌కు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన రావడం ఇందుకు కారణమని తెలిపింది. యాపిల్ మొత్తం విక్రయాల్లో ఈ ఐపాడ్ వాటా 70 శాతంగా ఉన్నది. దేశీయ టాబ్లెట్ మార్కెట్ రూపాంతరం చెందుతున్నదని, ముఖ్యంగా 5జీతో నడిచే టాబ్లెట్లకు డిమాండ్ అధికంగా ఉంటుందని అంచనాను విడుదల చేసింది. ప్రస్తుతం పండుగ సీజన్ కావడంతో అమ్మకాలు భారీగా పెరిగే అవకాశం ఉన్నదని పేర్కొంది.

# మండే స్టాక్ మార్కెట్ ఎలా ఉండబోతుంది..

మండే స్టాక్ మార్కెట్ ఎలా ఉంటుంది. సానుకూల లేదా ప్రతికూల ధోరణిని చూపించే అవకాశం ఉందా. నిపుణులు ఏం చెబుతున్నారనే తదితర విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం పదండి. స్టాక్ మార్కెట్ ఒక రోలర్ కోస్టర్ రైడ్ మాదిరిగా ఉంటుంది. ఒక రోజు ఆకాశంలో విహరిస్తే, మరో రోజు మాత్రం కిందకు పడిపోయి ఇన్వెస్టర్లకు నష్టాలను అందిస్తుంది. అయితే మే 19, 2025, సోమవారం భారత స్టాక్ మార్కెట్ తీరు ఎలా ఉంటుంది. సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు ఎలాంటి ధోరణిని చూపిస్తాయి? పాజిటివ్ ఊపుతో లాభాలను అందిస్తాయా లేక నెగిటివ్ ఒత్తిడితో నష్టాలను మిగులుస్తాయా? నిపుణులు ఏం చెబుతున్నారనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం. గత వారం మొదట్లో భారత స్టాక్ మార్కెట్ అస్థిరతతో కూడిన ప్రదర్శనను కనబరిచింది. తర్వాత మే 15న బలం చూపించి, సెన్సెక్స్ 1,200 పాయింట్ల లాభంతో 82,530కి, నిఫ్టీ 395 పాయింట్ల లాభంతో 25,062కి చేరింది. కానీ మే 16న మళ్లీ మార్కెట్ నష్టాలను చవిచూసింది. సెన్సెక్స్ 200 పాయింట్ల క్షీణతతో 82,300 స్థాయికి చేరుకుంది. ఈ అస్థిరత నేపథ్యంలో మే 19న మార్కెట్ ధోరణిని అంచనా వేయడం సవాలని నిపుణులు చెబుతున్నారు.బ్యాంకింగ్, ఐటీ, ఎఫ్ఎంసీజీ సెక్టార్లు భారత స్టాక్ మార్కెట్‌ను




నడిపిస్తాయి. మే 19కి సంబంధించి బ్యాంకింగ్ సెక్టార్‌పై ఒత్తిడి ఉంటే, నిఫ్టీ సూచిక కూడా నెగిటివ్ ధోరణిని చూపవచ్చు. అయితే, ఐటీ, ఫార్మా సెక్టార్లు గతంలో అస్థిర మార్కెట్లలో స్థిరత్వాన్ని చూపించాయి, కాబట్టి ఈ సెక్టార్లలోని బ్లూ చిప్ కంపెనీలు మార్కెట్‌ను సపోర్ట్ చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఎఫ్ఎంసీజీ సెక్టార్ సాధారణంగా డిఫెన్సివ్‌గా పరిగణించబడుతుంది. మార్కెట్ అస్థిరత సమయంలో ఇన్వెస్టర్లు ఈ స్టాక్‌ల వైపు మొగ్గు చూపుతారు.

## టాటా విద్యుత్ వాహనాలపై భారీ డిస్కౌంట్లు



ఈ ఏడాది జూన్‌లో కంపెనీ ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు గత ఏడాదితో పోలిస్తే 15 శాతం మేరకు తగ్గిన నేపథ్యంలో టాటా మోటార్స్ అమ్మకాలను పెంచుకునేందుకు ఎలక్ట్రానిక్ వాహనాలపై భారీ డిస్కౌంట్లు ప్రకటించింది. హారియర్ ఈవీపై దాదాపు లక్ష రూపాయల డిసౌంట్లను ప్రకటించింది.అయితే ఈ పరిమిత ఆఫర్ కేవలం ఎంపిక చేసిన వేరియంట్లపైన కొన్ని నగరాల్లోనే అందుబాటులో ఉంటుంది.టాటా వాహన యజమానులకు లాయల్టీ ప్రయోజనాలు లభిస్తాయి.టాటా టియాగో లాంగ్‌రేంజ్ వేరియంట్‌పై రూ. 40 వేల వరకు డిస్కౌంట్ పొందవచ్చు. వినియోగదారులు తమ పాత కారును అమ్మే సమయంలో రూ.20 వేల క్యాష్ డిస్కౌంట్, రూ.20 వేలు ఎక్స్‌చేంజ్ బోనస్‌గా పొందవచ్చు. కంపెనీ టాటా పంచ్ ఈవీపైనా ఇదేతరహా డీల్‌ను అందిస్తోంది.అలాగే దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన ఈవీల్లో ఒకటైన టాటా నెక్సాన్‌పైనా రూ.30 వేల ఎక్స్‌చేంజ్ బోనస్‌ను అందిస్తోంది. అదనంగా లాయల్టీ ప్రయోజనాలు, 6 నెలల పాటు టాటాపవర్ చార్జింగ్ స్టేషన్లలో వెయ్యి యూనిట్ల ఉచిత చార్జింగ్‌ను అందిస్తోంది. టాటా కర్వ్ ఈవీపై కొనుగోలుదారులు రూ.50 వేల వరకు ఎక్స్‌చేంజి బోనస్‌తో పాటు లాయల్టీ రివార్డు పొందవచ్చు. అలాగే మొదటి వెయ్యి కొనుగోలుదారులకు టాటా పవర్ చార్జింగ్ స్టేషన్లలో ఆరు నెలల పాటు ఉచిత చార్జింగ్ సదుపాయాన్ని కల్పిస్తోంది.

## మొబైల్ కు రోజుకు ఎన్నిసార్లు ఛార్జింగ్ పెట్టాలి...

మొబైల్ ఫోన్.. నిత్యవసర వస్తువు అయిపోయింది. ప్రతి ఒక్కరి చేతిలో ఈ మొబైల్ ఫోన్ ఉంటుంది. ఈ మొబైల్ వాడేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించకుండా.. ఇష్టం వచ్చినట్లు వాడేస్తున్నారు. ముఖ్యంగా ఛార్జింగ్ పెట్టుకునేటప్పుడు కొన్ని టిప్స్ ఫాలో కావాలని నిపుణులు చెబుతున్నారు. ప్రతిరోజు మొబైల్ ఫోన్ కు ఒకటి లేదా అవసరమైతే రెండుసార్లు మాత్రమే ఛార్జింగ్ పెట్టాలని సూచనలు చేస్తున్నారు. అంతకంటే ఎక్కువ సార్లు మొబైల్ కు ఛార్జింగ్ పెడితే బ్యాటరీ మొత్తం పోతుందని అంటున్నారు. మొబైల్ కు ఎక్కువ సార్లు ఛార్జింగ్ పెడితే.. అది వేడెక్కి.. పేలిపోయే సంఘటనలు కూడా జరుగుతాయట. ఇక 20% వచ్చినప్పుడు ప్లీజ్ కనెక్ట్ ఛార్జ్ అన్నప్పుడు మాత్రమే ఛార్జింగ్ పెట్టాలని సూచనలు చేస్తున్నారు. అలాగే 80% ఛార్జింగ్ ఎక్కిన తర్వాత వద్దనుకుంటేనే తొలగించాలని చెబుతున్నారు.



ప్రజా విశ్వంభర

# సినిమా..

## ఐశ్వర్య మీనన్.. హీటెక్కించే లుక్స్ తో స్టన్నింగ్ స్టిల్స్!



గ్లామర్ ప్రపంచంలో తనదైన స్థానం ఏర్పర్చుకుంటున్న నటి ఐశ్వర్య మీనన్ మళ్లీ ట్రెండింగ్‌లోకి వచ్చేసింది. తాజాగా ఆమె నీయాన్ పింక్ లెహంగాలో చేసిన ఫోటోషూట్ నెటిజన్లను మంత్రముగ్ధులను చేస్తోంది. బ్రైట్ కలర్ లెహంగా, ఫ్లోరల్ వర్క్‌తో ఉన్న బ్లౌజ్, జ్వెలరీ%ొా% అన్నీ కలిసినప్పుడు ఐశ్వర్య అందం మరింత మెరిసిపోయింది. తన నడుము, గ్లామర్ యాంగిల్స్‌ను బోల్డ్‌గా ఎలివేట్ చేసిన ఆమె ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఐశ్వర్య ఫ్యాషన్ సెలెక్షన్

ఈసారి మరింత స్టైలిష్‌గా నిలిచింది. లైటింగ్, పౌజింగ్, మేకప్ అన్నీ కలిసే ఆమె లుక్‌కు ప్రత్యేకతను తీసుకొచ్చాయి. కుర్చీలో నిదానంగా కూర్చున్న స్టిల్స్‌లో ఆమె క్యూట్ హావభావాలతో ఆకట్టుకోగా, బయట తీసిన ఫోటోలలో ఆమె కొంటె లుక్స్ తో మరింత అందంగా కనిపించింది. తన ఫోటోషూట్స్‌తో పాటు సినిమాల్లోనూ మంచి గుర్తింపు సంపాదించుకున్న ఐశ్వర్య, కెరీర్ విషయంలో అడుగడుగునా మెరుగైపోతుంది. తమిళంలో 'హిప్పీ', 'తామిళ్ ప్కెలట్', మలయాళంలో 'మన్‌త్రీ', 'బజూక' వంటి చిత్రాలతో పాపులర్ అయ్యింది. తెలుగులో నిఖిల్ సరసన నటించిన 'స్పై' మూవీ ద్వారా టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా భారీ అంచనాల మధ్య విడుదలై మిశ్రమ స్పందన పొందినప్పటికీ, ఐశ్వర్యకి నటిగా మంచి గుర్తింపు తీసుకొచ్చింది.

ప్రస్తుతం ఆమెకు తెలుగు, తమిళ భాషల్లో మంచి ఆఫర్స్ వస్తున్నాయి. బోల్డ్ లుక్స్, గ్లామర్ ప్రెజెంట్ చేయగల సామర్థ్యం ఉన్న నటి అయిన ఐశ్వర్య, ప్రస్తుతం కంటెంట్ బేస్డ్ పాత్రలవైపు అడుగులు వేస్తోందని టాక్. ఇటీవలి ఫోటోషూట్ చూస్తే ఆమె

కొత్తగా ఒక ట్రెండ్ సెట్ చేయబోతుందనే భావన స్పష్టంగా కనిపిస్తోంది. ఇలాంటి స్టైలిష్ ప్రెజెన్స్‌తో పాటు నటనలో తనదైన ముద్ర వేసే ఐశ్వర్య మీనన్, త్వరలోనే తెలుగులో ఒక మిడ్‌రేంజ్ హీరో సరసన నటించే అవకాశం ఉందని సమాచారం.

## సడెన్‌గా పెద్ది షూటింగ్‌కి బ్రేక్ ఇచ్చారు..



గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ ప్రధాన పాత్రలో, 'ఉప్పెన' ఫేమ్ సానా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'పెద్ది'. 'గేమ్ ఛేంజర్' చిత్రంతో నిరాశ చెందిన అభిమానులు ఇప్పుడు ఈ కొత్త సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. 'రంగస్థలం' తరహాలో మాస్, రా లుక్‌లో చెర్రీ కనిపించడంతో పాటు ఫస్ట్ లుక్, గ్లింప్స్‌తో సినిమాపై క్రేజ్ విపరీతంగా పెరిగిపోయింది. ముఖ్యంగా రామ్‌చరణ్ కొట్టిన క్రికెట్ షాట్ సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారింది.ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ రామ్‌చరణ్‌కు జోడిగా నటిస్తోంది. ఇది రామ్ చరణ్‌తో చేస్తున్న తొలి తెలుగు సినిమా కావడంతో ,ఈ కాంబోపై మంచి హైప్ ఏర్పడింది. తెరవెనుక బుచ్చిబాబు జెట్ స్పీడ్‌తో పని చేస్తున్నారు. ఇప్పటి వరకు సినిమాకు సంబంధించి 50 శాతం పైగా షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం హైదరాబాద్ శివారులో వేసిన భారీ సెట్‌లో యాక్షన్ సీన్ చిత్రీకరణ జరుగుతోంది. ఇందులో చరణ్, జాన్వీ ఇద్దరూ పాల్గొంటున్నారు. షూటింగ్ బ్రేక్ సమయంలో, బుచ్చిబాబు-జాన్వీ కలిసి హైదరాబాద్‌లోని ఏఎంబీ మాల్‌లో 'హరిహర వీరమల్లు' సినిమా వీక్షించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే అనూహ్యంగా తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా షూటింగ్ తాత్కాలికంగా నిలిచిపోయింది. యాక్షన్ ఎపిసోడ్ పూర్తిగా ఔట్‌డోర్‌లో చేస్తుండడంతో వాతావరణం సహకరించకపోవడం వలన బ్రేక్ ఇవ్వాల్సి వచ్చింది. వర్షాలు తగ్గిన వెంటనే మళ్లీ షూటింగ్‌ను పునఃప్రారంభించనున్నట్లు సమాచారం. ఈ సినిమా ఉత్తరాంధ్ర విలేజ్ స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతోంది. ఇందులో వచ్చే ట్రైన్ యాక్షన్ సీక్వెన్స్, భారతీయ సినిమాలో ఇప్పటివరకు చూడనంత విజువల్ ట్రీట్‌గా ఉంటుందని తెలుస్తోంది. 'రంగస్థలం' కంటే ఇది చాలా గొప్పగా ఉంటుందని రామ్‌చరణ్ స్వయంగా చెప్పడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషీగా ఉన్నారు. ఈ చిత్రాన్ని రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా 2026 మార్చి 27న విడుదల చేయాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది.

తర్వాత సుకుమార్ దర్శకత్వంలో మరో సినిమా చేయనున్నాడు. ఈ కాంబోలో వచ్చిన 'రంగస్థలం' ఎంత పెద్ద హిట్ అయ్యిందో అందరికీ తెలిసిందే. ఇకపోతే, చరణ్ ప్రస్తుతం మరో రెండు మూడు ప్రాజెక్టుల కోసం కథలు వింటున్నట్లు సమాచారం.మొత్తానికి 'పెద్ది' సినిమాపై భారీ అంచనాలు అయితే ఉన్నాయి.

## బ్లాక్ డ్రెస్‌లో మీనాక్షి చౌదరి అందాల మాయ



గ్లామరస్ లుక్‌లు ఆమెకు కొత్తకాదు కానీ, ఈసారి మాత్రం మీనాక్షి చౌదరి చూపిన అటిట్యూడ్ చూస్తే ఏవరికైనా వావ్ అనిపించకమానదు. బ్లాక్ షైనీ డ్రెస్‌లో ఆమె చేసిన ఫోటోషూట్ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కాస్త బోల్డ్‌గా కనిపించిన మీనాక్షి స్టైలింగ్‌లోని ఫినిషింగ్, హేర్ డూ, మేకప్ అన్నీ కూడా పర్ఫెక్ట్ అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఫ్రెంచ్ మ్యూజిక్‌కి స్టయిలిష్‌గా పోజులిచ్చిన ఈ ఫోటోలు యువతను ఆకర్షిస్తున్నాయి. మెడ దగ్గర నుండి స్లీవ్‌కు లూప్ లా డిజైన్ చేసిన డ్రెస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రత్యేకంగా చెప్పాల్సిన విషయం ఏంటంటే, ఆమె కళ్ల లుక్స్. కెమెరాకి ఆమె ఇచ్చిన లుక్స్‌లో కనిపించిన కాన్ఫిడెన్స్, ఫెమినిన్ గ్రేస్ అన్నీ కలిసి ఫోటోషూట్‌ను లెవెల్ మీదకు తీసుకెళ్లాయి. అందుకే ఈ ఫోటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. సినీ సెలబ్రిటీలు కూడా కామెంట్స్ చేస్తూ మీనాక్షికి ఫుల్ మార్కులు వేస్తున్నారు. కేవలం ఫోటోలు మాత్రమే కాదు, మీనాక్షి చౌదరి కెరీర్ కూడా ఇంప్రెసివ్‌గా కొనసాగుతోంది. మిస్ ఇండియా రన్నరప్‌గా గుర్తింపు పొందిన ఆమె, తన సినీ ప్రస్థానాన్ని 'ఇచట వాహనములు నిలుపరాదు' అనే చిత్రంతో ప్రారంభించారు. ఆ తరువాత 'ఖిలాడి', 'హిట్ 2', 'గుంటూరు కారం' వంటి సినిమాల్లో గ్లామరస్ పాత్రలతో ఆకట్టుకున్నారు. ఆమెకి త్వరలో విడుదల కాబోయే సినిమాలు కూడా ఓ కీలకమైన మైలురాయిగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## మిరాయ్ నుండి వైబ్ ఉంది బేబి.. సాంగ్ విడుదల..



'హనుమాన్'తో భారీ విజయాన్ని అందుకున్న తేజ సజ్జా ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోన్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'మిరాయ్' ద్వారా మళ్లీ ప్రేక్షకులను మెస్మరైజ్ చేయడానికి సిద్ధమవుతున్నారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయికగా నటిస్తున్నారు.

మరో విశేషం ఏంటంటే .. మంచు మనోజ్ ఇందులో ప్రతినాయకుడిగా ధీటైన పాత్రలో కనిపించనున్నారు. శ్రియ, జయరామ్, జగపతిబాబు వంటి నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టి.జి. విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్‌లో థియేటర్లలో విడుదల కానుంది.

ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచగా, తాజాగా విడుదలైన ఫస్ట్ సాంగ్ ప్రోమో సినిమాకు మరింత హైప్ క్రియేట్ చేసింది. "వైబ్ ఉందిలే బేబీ వైబ్ ఉందిలే ఈ గ్లోబ్‌ను ఊపే వైబ్ ఉందిలే" అంటూ సాగే పాట ఫుల్ ఎనర్జీతో, స్టైలిష్ విజువల్స్‌తో ఆకట్టుకుంటోంది. తేజ సజ్జా - రితికా జంటపై ఈ పాటను పోలంకి విజయ్ నృత్య దర్శకత్వంలో చిత్రీకరించారు. పాటకు కృష్ణకాంత్ మాస్టర్‌ఫుల్ లిరిక్స్ అందించగా, మ్యూజిక్ డైరెక్టర్ గౌర హరి తమ మ్యూజిక్ మ్యాజిక్‌ను మళ్లీ చూపించారు. పాటను ఫేమస్ బాలీవుడ్ సింగర్ అర్మాన్ మాలిక్ ఆలపించడంతో, ఈ సాంగ్‌కు పాన్ ఇండియా వైబ్ వచ్చేసింది.

ప్రస్తుతం ఈ పాట నెటిజన్స్‌ని ఎంతగానో ఆకట్టుకుంటుంది. పాటకి మంచి రెస్పాన్స్ వస్తుంది. మిరాయ్ సినిమాతో తేజ సజ్జా మరోసారి సూపర్ హీరో ఫీల్ కలిగించే కాన్సెప్టుతో ప్రేక్షకుల ముందుకు రానున్నారని టాలీవుడ్ వర్గాలు చెప్పుకుంటున్నాయి.

గ్లోబల్ స్కేల్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీ నుంచి వచ్చే ప్రతి అప్డేట్‌కి అభిమానులు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు. వైవిధ్యమైన కాన్సెప్ట్‌లతో ప్రేక్షకులని అలరిస్తున్న తేజ సజ్జా ఈ చిత్రంతోను మంచి హిట్ కొడతాడని అంటున్నారు.

## మన దేశంలో చాలా మందికి ఎలాంటి పనిలేదు

సోషల్ మీడియాలో తరచుగా సెలబ్రిటీలపై ట్రోలింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ట్రోలింగ్‌లు, ప్రతికూల వ్యాఖ్యలపై నటీనటులు అప్పుడప్పుడు తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తునే ఉన్నారు. తాజాగా ఈ విషయంలో టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేసింది. సోషల్ మీడియాలో వచ్చే అనవసర విమర్శలపై రకుల్ తనదైన శైలిలో ఘాటుగా స్పందించింది. రకుల్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. "సోషల్ మీడియా ఇప్పుడు అందరికీ అందుబాటులోకి వచ్చింది. దురదృష్టవశాత్తూ, మన దేశంలో చాలా మందికి ఎలాంటి పనిలేదు. వారందరికీ ఉచిత డేటా ప్లాన్‌లు అందుబాటులో ఉన్నాయి. అందువల్ల, ఇతరుల జీవితాల గురించి కామెంట్స్ చేయడం తప్ప వారికి ఇంకేమీ పనిలేకుండా పోయింది" అని అన్నారు. కాగా రకుల్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.మరోవైపు రకుల్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో సెలబ్రిటీలు ఎదుర్కొంటున్న వేధింపులు, ట్రోలింగ్‌కు అద్దం పడుతున్నాయి. ఉచిత డేటా ప్లాన్‌ల లభ్యత, స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరగడం వల్ల ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాకు సులభంగా చేరువయ్యారని, అయితే దీనిని దుర్వినియోగం చేసే వారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని ఆమె పరోక్షంగా అభిప్రాయపడ్డారు.



Edited, Published & Owned by KACHAM SATYANARAYANA. Printed at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS, #3-63, THANEDHARPALLE, GHANPUR STATION MANDAL, THANEDHARPALLE, WARANGAL, TELANGANA - 506143. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | RNI No: TGTEL/25/A1676, Email: vishwambhara.daily@gmail.com